Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 28 పేజీలు 8 వెల : 5 బుధవారం 16 జూలై 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్


| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజీ |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

## భిన్నత్వంలో ఏకత్వమే మన విధానం


### జాతీయ సమగ్రత, భాషా సామరస్యం ముఖ్యం

### పవన్ హిందీ భాషా వ్యాఖ్యలపై జనసేన వివరణ



**అమరావతి:** భిన్నత్వంలో ఏకత్వం, జాతీయ సమగ్రత, భాషా సామరస్యంపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచన విధానమని జనసేన స్పష్టం చేసింది..హైదరాబాద్‌లో నిర్వహించిన రాజ్యభాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.. అయితే, దీనిపై జనసేన పార్టీ స్పందించింది.. మాతృభాషకు ప్రథమ ప్రాధాన్యత.. సమాజంలో మన గుర్తింపుకు మూలం మాతృభాషే అని స్పష్టం చేసింది జనసేన. బాల్యంలో విద్యాభ్యాసానికి, మన సంస్కృతులను కాపాడుకోవడానికి మాతృభాష తప్పనిసరిగా ఉండాలన్నది పవన్ అభిప్రాయమని తెలిపింది. బహుభాషా ప్రావీణ్యం జీవితంలో ఎదిగేందుకు ఒక సాధనం అని పేర్కొన్నారు.. అది జ్ఞానాన్ని అందించడమే కాకుండా, భిన్న సంస్కృతుల ప్రజలతో మమేకం అయ్యేందుకు, అవకాశాలను మెరుగుపరచేందుకు తోడ్పడుతుందని పేర్కొంది. అన్ని భాషలను గౌరవించాలి.. ఏ భాషను బలవంతంగా రుద్దవద్దని పవన్ కల్యాణ్ అన్నారని జనసేన స్పష్టం చేసింది. ప్రతీ భాషకు సముచిత గౌరవం ఇవ్వటం కనీస బాధ్యత. భాషను గౌరవిస్తూ, అది ప్రజలను కలిపే వారధిగా పనిచేస్తుందని పార్టీ స్పష్టం చేసింది. భాషను బలవంతంగా రుద్దితే అది ప్రజలను విడదీస్తుందన్న అభిప్రాయాన్ని వెల్లడించింది. హిందీని బలవంతంగా రుద్దడం లేదు.. కానీ, హిందీ వల్ల ప్రయోజనాలు అనేకం అని తెలిపింది. హిందీ భాషను ఖచ్చితంగా నేర్చుకోవాలనే విధానానికి పవన్ కల్యాణ్ ఎప్పుడూ వ్యతిరేకమే. అయితే, ఉద్యోగ అవకాశాల కోసం, విభిన్న ప్రాంతాల ప్రజలతో మమేకం అయ్యేందుకు హిందీని నేర్చుకోవడం వల్ల ఫలితాలే తప్ప నష్టం ఏమీ లేదని పార్టీ పేర్కొంది. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ అస్తిత్వం. భాషా వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం ద్వారా భారతదేశం మరింత సమగ్రాభివృద్ధిని సాధించగలదని, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడగలదని పవన్ కల్యాణ్ అభిప్రాయం అని జనసేన తెలిపింది..

## దేశానికి గేమ్ ఛేంజర్‌గా పివి ఆర్థిక సంస్కరణలు



### దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు భారత్ గతిని మార్చాయి

### బహుభాషా వేత్తయే కాకుండా గొప్పరాజనీతిజ్ఞుడు

### పివి కృషితోనే దేశంలో ఐటి విప్లవం సాధ్యమయ్యింది

### పివి ఆర్థిక విధానాలపై చంద్రబాబు ప్రశంసలు

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పివి తీసుకుని వచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజార్‌గా ఆర్థికరంగానికి ఊతంగా నిలిచాయని అన్నారు. దేశానికి అనేక రంగాల్లో పీవీ నరసింహారావు సేవలందించారు. ఆర్థిక సంస్కరణలు అంటే గుర్తొచ్చేది పివియేనని అన్నారు. లైసెన్స్‌రాజ్ నిబంధనల నుంచి దేశాన్ని బయటకు తెచ్చారు. 1990ల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. సరైన విధానాలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. ఆ సమయంలో పీవీ దూరదృష్టితో ఆర్థిక విధానాలను అమలు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక దేశ ఆర్థిక సంస్కరణలు కొత్తరూపు సంతరించుకుని గేమ్ ఛేంజర్‌గా మారాయి. పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం వచ్చిందని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పారు. 17 భాషలు నేర్చుకున్న పీవీ.. ప్రధాని, కేంద్రమంత్రి, సీఎంగా సేవలందించారని గుర్తుచేశారు. దిల్లీలో నిర్వహించిన లెక్చర్ సిరీస్ ఆరో ఎడిషన్ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు.



2లో..

### నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

ఫార్మసీ,లా కాలేజీల ఏర్పాటు చిరకాల కోరిక

మహాత్మాగాంధీ వర్సిటీ ప్రతిష్టను పెంచాలి

నల్లగొండ విద్యారంగ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి



2లో..

### హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

మార్నింగ్ వాక్ చేస్తున్న సిపిఐ నేతపై కాల్పులు

కాల్పుల్లో చందునాయక్ అక్కడిక్కడే మృతి

పది బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

## బిసిల్లో ముస్లింలకు చోటు తగదు

### దీనిపై బిజెపి త్వరలోనే ఉద్యమిస్తుంది: బండి



**కరీంనగర్:**తెలంగాణలో అమలు చేయనున్న 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అదే జరిగితే అసెంబ్లీ లోపల, బయటా బీజేపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను తీసేస్తేనే మద్దతిస్తామని చెప్పారు. ముస్లింలకు బిసిల్లో చోటు కల్పించడం కేవలం ఓటుబ్యాంక్ రాజకీయలు తప్ప మరోటి కాదన్నారు. తెలంగాణలో12 శాతమున్న ముస్లిలంకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా.. 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయడమేంటని ప్రశ్నించారు. అలాగైతే బీసీలకు అదనంగా దక్కేది 5 శాతం మాత్రమేనని అన్నారు. అతి త్వరలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామని తెలిపారు. బనకచర్లపై తెలంగాణ వాదనను గట్టిగా విన్పించాలని సీఎం రేవంత్ కు బండి సంజయ్ సూచించారు. బనకచర్ల విషయలో రాజకీయాలకు అతీతంగా సీఎంకు అండగా ఉంటామని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు- చెప్పారు.



## జలవివాదాలపైనే తెలంగాణ ఫోకస్

2లో..

నేటి జలశక్తి మంత్రి భేటీ ఉంటుందా?

బనకచర్లపై ఏపి ప్రభుత్వం పట్టు

తెలంగాణ లేఖతో సమస్య జలవివాదాలు

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది.



2లో..

### కేరళ నర్స్ నిమిషకు భారీ ఊరట

యెమెన్‌తో కేంద్రం చర్చలు ఫలవంతం

ఉరి అమలు తాత్కాలికంగా వాయిదా

### దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సవరణ

పలు సూచనలు చేస్తూ టిడిపి వినతిపత్రం

ఢిల్లీలో ఇసిని కలిసిన పార్టీ నేతలు



2లో..

## నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

**హైదరాబాద్:** నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేది నా ప్రధాన ధ్యేయం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండలో ఫార్మసీ కాలేజీ,లా కాలేజీ ఏర్పాటు- చేయాలనేది తన చిరకాల కోరిక అన్నారు.ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి ప్రయత్నిస్తున్నాం అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నల్గొండ అభివృద్ధి పై మంత్రి కోమటి రెడ్డి సమీక్ష నిర్వహించారు. నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేదే తన ప్రధాన ధ్యేయమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ ప్రజలు తనను ఆశీర్వదిస్తూ వస్తున్నారని,వారి ఉన్నతి కోసం ఎంత చేసిన తక్కువే అని మంత్రి పేర్కొన్నారు.

డా.బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి,మహాత్మా గాంధీ యూనివర్సిటీ-,కాలేజీ,స్కూల్ ఎడ్యుకేషన్ పై ఆ శాఖ ఉన్నతాధికారుతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయమని దాని ఖ్యాతిని పెంచేలా వీసీ,రిజిస్ట్రార్ ,పాలక సభ్యులు పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. యూనివర్శిటీకి ప్రత్యేకంగా 60.22 కోట్ల గ్రాంట్ మంజూరు చేశామని,ఇన్ఫ్రా డెవలప్మెంట్ చేస్తున్ననుందున కొత్త కోర్సుల పై ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో కొత్తగా ఫార్మసీ,ఎల్ ఎల్ బి,ఎల్ ఎల్ ఎం లాంటి కోర్సులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని వీసీ అల్తాఫ్ హుస్సేన్ మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి అన్ని విధాల ప్రయత్నిస్తు న్నామని అందుకే ఇంత బిజీ షెడ్యూల్లో కూడా విద్యా శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షకు వచ్చారన్నారు. నల్గొండలో యూనివర్సిటీ- కాలేజ్ ఆఫ్ ఫార్మసి,లా కాలేజీ ఏర్పాటు- చేయాలనేది నా చిరకాల కోరికనీ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని త్వరలో నూతన కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కాలేజ్,స్కూల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.డిగ్రీ,జూనియర్ కాలేజీల్లో మౌళిక సదుపాయాలు..హై స్కూల్స్ బలోపేతంపై చర్చించి,అందుకు విద్యాశాఖ అధికారులు అందించాల్సిన సహకారం పై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి ప్రభుత్వ కాలేజీలు,స్కూల్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై చర్చిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా,సాంకేతిక,ఉన్నత విద్యా మండలి కమిషనర్ దేవసేన,మహాత్మగాంధీ యూనివర్సిటీ- వీసీ అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ రవి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

హైదరాబాద్: హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో కాల్పుల కలకలం రేగింది. సీపీఐ నేత చందు నాయక్‌పై ప్రత్యర్థులు కాల్పులు జరిపారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు- చేసుకుంది. శాలివాహననగర్‌లోని పార్క్ వద్ద సీపీఐ నేతపై దుండగులు కాల్పులు జరిపారు. మంగళవారం ఉదయం చందు నాయక్ వాకింగ్ చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రత్యర్థులు కాపు కాచి మరీ హత్య చేశారు. స్నేహితులతో కలిసి నడుచుకుంటూ వెళు_న్న ఆయనను అడ్డగించిన ప్రత్యర్థులు ముందుగా అతడి కళ్లలో కారం కొట్టారు. దీంతో భయాందోళనకు గురైన చందు అక్కడి నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయితే చందును వెంటాడి వెంబడించి మరీ గన్‌తో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు దుండగులు. దీంతో చందు నాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆపై అక్కడి నుంచి దుండుగలు స్విఫ్ట్ కారులో పరారయ్యారు. హత్య సమయంలో ఐదుగురు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని చందు నాయక్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాత కక్షలే హత్యకు కారణాలుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నాగరకర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన చందు నాయక్ కుటుంబంతో చైతన్యపూరిలో నివాసం ఉంటున్నారు. మృతుడు గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సీపీఐ నేత చందు నాయక్ హత్యపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యను స్థానిక నేతలు ఖండించారు.

## కేరళ నర్స్ నిమిషకు భారీ ఊరట

న్యూఢిల్లీ: యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట దక్కింది. యెమెన్ ప్రభుత్వం చివరిక్షణంలో ఉరిశిక్ష అమలును వాయిదా వేసింది. ప్రస్తుతం యెమెన్ ప్రభుత్వంతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆమెను రక్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించడంతో బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో నిర్ణయించిన ప్రకారం.. జులై 16న ఈ శిక్ష అమలుచేయాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్థానిక అధికారులు దీన్ని నిలిపివేసినట్లు- సమాచారం. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్నివిధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. అవి ఫలించి మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6కో) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.ఉరికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో మోడీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఫలించి ఉరితీతు తాత్కాలికగా వాయిదా వేశారు. నిమిష కుటుంబం మాత్రం నిమిషను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న ఒకదారి అగమ్యగోచరంగా మారింది. హతుడి కుటుంబం అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే.. చివరి నిమిషంలోనైనా నిమిషకు ఉరి తప్పే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే నిమిష ప్రియ కుటుంబం బ్లడ్ మనీ కింద 10 లక్షల డాలర్లు సిద్ధం చేసుకుంది. అయితే, నిమిష కుటుంబానికి, హతుడి కుటుంబానికి మధ్యవర్తిత్వం వహించిన లాయర్ దెబ్బ కొట్టాడు.

పెద్ద మొత్తంలో ఫీజు డిమాండ్ చేశాడు. తన ఫీజు చెల్లించే వరకు బ్లడ్ మనీ చర్చలు జరపనని తేల్చి చెప్పాడు. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన బ్లడ్ మనీ వాయిదా పడింది. ప్రస్తుతం నిమిష ప్రియ కుటుంబం తరపున శామ్యుయెల్ జెరోమ్, షేక్ హబీబ్ హుమర్‌లు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం.

# అసెంబ్లీ ఆవరణలో ఆషాడబోనాలు

### బంగారు మైసమ్మకు పూజలు చేసిన స్పీకర్

హైదరాబాద్ శాసనసభ ఆవరణలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ఆషాఢ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఆషాఢ మాసం బోనాలలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# నదుల అనుసంధానానికి ఆద్యులు కెఎల్ రావు

**ఆయన మార్గాన్ని అనుసరిస్తున్న చంద్రబాబు**

**కెఎల్ రావు జయంతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల**

విజయవాడ: ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని.. అయితే 50 ఏళ్ల క్రితమే నదుల అనుసందానికి నాంది పలికింది కేఎల్ రావు అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తు చేసుకున్నారు.కేఎల్ రావు స్ఫూర్తిని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారని తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, హిరాకుడ్ సహా దేశంలో అత్యంత భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కేఎల్ రావు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రఖ్యాత ఇంజినీర్ కేఎల్ రావు తెలుగువారు కావడం గర్వకారణమని కొనియాడారు. ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి మంత్రి నిమ్మల నివాళులర్పించారు.




అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరవుతో వచ్చే దుర్భిక్ష పరిస్థితులు పారద్రోలాలంటే నదుల అనుసందానమే మార్గమని స్పష్టం చేశారు. ఏటా 3 వేల టీఎంసీల వరద నీరు సముద్రంలోకి పోకుండా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు నిర్మిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని మండిపడ్డారు. ప్రశ్నార్థకమైన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని అన్నారు. 2027 డిసెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్టును పూర్ తిచేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టిసీమ కాదు.. వట్టిసీమ అని గతంలో శాసనసభలో జగన్ అవహేళన చేశారని.. చంద్రబాబు కృషి పట్టు- దలతో పట్టిసీమ పూర్తి చేయడంతో కృష్ణాడెల్టా సస్యశ్యామలం అవుతోందని వెల్లడించారు. ఈ ఏడాది కృష్ణా డెల్టాలో వర్షాలు ఆశించినంతగా కురవలేదన్నారు. ఎగువ ప్రాజెక్టులు నిండకపోయినా పట్టిసీమ నీరుతో కృష్ణా డెల్టా కళకళలాడుతోందని చెప్పుకొచ్చారు. విజయవాడలో నీలం రంగులో ప్రవహించే కృష్ణమ్మ ..

గోదారమ్మ కలవడంతో ఎరుపురంగు పులుముకుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పెట్టలేదని

ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస నిర్వహణ లేకపోవడంతోనే గతంలో పులిచింతల గేట్లు- కొట్టు-కుపోయాయని వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను నిర్వహణ, మరమ్మతులకు నిధులిచ్చామన్నారు. ప్రజలిచ్చిన అధికారంతో ఒళ్లు దగ్గర పెట్టు-కుని పనిచేస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో ఉత్తరాంధ్రకు పోలవరం ద్వారా నీరు తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. హంద్రీనీవా ప్రవాహం 2100 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కుల ప్రవాహం పెంచేలా ఏడాదిలోనే కాలువలు వెడల్పు చేశామన్నారు. స్ఫూర్తి నిచ్చేలా పనిచేయడమే కెఎల్ రావుకు ఇచ్చే ఘనమైన నివాళి అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సవరణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్‌లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు - జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగనుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని పార్టీ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపోహలకు చోటులేకుండా సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు.

కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో దేశ వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించనున్న నేపథ్యంలో సీఈసీకి తెలుగుదేశం పార్టీ 7 సూచనలు చేసింది. దిల్లీలో సీఈసీని కలిసిన తెదేపా నేతల బృందం ఈమేరకు పార్టీ తరఫున వినతిపత్రం అందించింది. ఎస్ఐఆర్‌ను ఏపీలో అమలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధ్రువపత్రాల విషయంతో పాటు- ఓట్ల తొలగింపుపై ప్రజల్లో నెలకొన్న అపోహలపై సందేహాలను లేవనెత్తింది. ఎస్ఐఆర్ వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని, ఎవరి ఓట్లు- తొలగించబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెదేపా నేతలు తెలిపారు. తెదేపా ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు, కూన రవికుమార్ తదితరులు సీఈసీని కలిసిన వారిలో ఉన్నారు. ఓటర్ల జాబితా ధ్రువీకరణను బలోపేతం చేయాలని,కాగ్ ఆధ్వర్యంలో ఏడాదికోసారి థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. ఓటర్ల జాబితా రూపొందించడంలో ఏఐ సాయం తీసుకోవాలని టిడిపి సూచించింది.ఆధార్ సహాయంతో నకిలీ ఎపిక్ నంబర్లను గుర్తించాలని,. ఇంక్ ఆధారిత ధ్రువీకరణ స్థానంలో బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియను అమలు చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను భాగస్వాములను చేయాలి. డ్రాఫ్ట్ రోల్స్‌ను ముందస్తుగా బీఎల్‌ఏలతో పంచుకోవడాన్ని తప్పనిసరి చేయాలని కోరింది. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించి జిల్లాల వారీ డేటాను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటు-లో ఉంచాలి.. దీనివల్ల పారదర్శకతతో పాటు- ప్రజలు సులభంగా చెక్ చేసుకోవచ్చని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్నికల సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం,

జరిమానాలు విధించడం చేయాలి. స్థానిక పరిస్థితుల ప్రభావం ఎన్నికలపై పడకుండా బీఎల్‌వోలు, ఈఆర్వోలను తరచూ మారుస్తుండాలని అన్నారు. వలసదారులు, గిరిజన తెగలకు చెందిన వారు, నిరాశ్రయులైన వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. దీనికోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని టిడిపి తెలిపింది. ఓటర్ల జాబితాపై సంప్రదింపులు, పర్యవేక్షణకు ప్రతి నెలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా, నియోజకవర్గ ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించాలనికూడా నేతలు సూచించారు.

## చేపల వేటలో శిక్షణ దరఖాస్తులకు ఆహ్వానం

**విజయవాడ:** బాదంపూడిలో గల దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణా కేంద్రంలో చేపల వేటలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ విద్యార్హతలు అనుభవము మొదలగు వివరాలు తెలుపుతూ ధరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలి. దీనిని మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా వారికి చేరే విధంగా పంపవలసిందిగా జిల్లా మత్స్య శాఖ అధికారి బి. నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలోని, మత్స్యకారులు, యువకులు, జాలరులు, సహకార సంఘముల సభ్యులు చేపల పెంపకం నందు ఆసక్తి కలిగిన ఇతరులు, షెడ్యూల్డ్ కులములు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు అర్హులు. ఉపకార వేతనము లేకుండా 20 సీట్లు కలవు, ఇంటర్వ్యూలు 29 న ఉదయం 11.00 గంటలకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయములో నిర్వహించబడును. ఇంటర్వ్యూలో ఎంపికైన వారి పేర్లు అదే రోజు సాయంత్రం 4.00 గంటల తర్వాత కార్యాలయము నోటీసు బోర్డులో ఉంచుతారు. మూడు మాసముల శిక్షణా కాలము ఆగస్ట్ 1నుండి అక్టోబర్ 31 వరకు ఉంటుంది. శిక్షణా కాలములో మత్స్య క్షేత్రములు మరియు రిజర్వాయర్లల్లో చేపలు పెంపకము గురించి బోధన మరియు ప్రాక్టికల్ తో కూడిన కోర్సు భోదించబడును. శిక్షణాంతరము పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు- అందించబడును. 5 వ తరగతి ఆ పైన చదువుకున్న వారికి ప్రాదాన్యత, తెలుగులో చదడం, రాయడం తెలిసిన వారికి కూడా అవకాశము

ఇవ్వబడుతుంది. 18-30 సంవత్సరములు మధ్య వయస్సు గల వారు అర్హులు, వారి అర్హతలు ఎంపిక

కమిటీ- ప్రత్యేక పరిగణనలో వయస్సు పరిమితిని సడలించవచ్చును. సహాయ పరిశీలకులు మత్స్యశాఖ హోదాకు తగ్గకుండా మత్స్యశాఖ అధికార్ల నుండి పొందిన అనుభవం గల సర్టిఫికెట్లు- దరఖాస్తుతో జతపరిచి పంపవలయును. అభ్యర్థి బయోడేటాలు స్వదస్తూరి లేదా -టైప్ చేసిన దరఖాస్తులు గానీ 25వ తేదీ లోగా కార్యాలయానికి పంపాలి..

# జలవివాదాలపైనే తెలంగాణ ఫోకస్

**న్యూఢిల్లీ/హైదరాబాద్:** ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేంద్రంపై పరోక్షంగా ఒత్తిడిపెంచి ఒక్కో పనిని సానుకూలం చేసుకుంటున్నారు. ఈక్రమంలో బనకచర్లపై తెలంగాణను ఒప్పించేందుకు కేంద్రంతో భేటీ ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో బనకచర్లపై నేరుగా చర్చ అని చెప్పకుండా జలవివాదాలపై అంటూ..కేంద్రమంత్రి పాటిల్ ఇరు రాష్ట్రాల సిఎంల భేటీకి నేడు ఆహ్వానించారు. అయితే ఈ ఎత్తుగడను ముందే పసిగట్టిన తెలంగాణ ఈ భేటీలో జలవివాదాలు తప్ప బపనకచర్లపై చర్చుండరాదని మెలికపెట్టి లేఖ రాసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారంలో కృష్ణా, గోదావరి జలాల గురించి మాత్రమే చర్చించాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది చేయకుండా కేవలం బనకచర్లపై చర్చించడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన క్రమంలో ఈ సమావేశం ఉంటుందా లేదా అన్నది అనుమానంగా మారింది. ఇరు రాష్ట్రాల మధ్యజలవివాదాల పరిష్కారం కోసం అంటూ



బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే నేటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం తన లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే నేటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న బుధవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాలసీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు-

రాష్ట్రాల తరపున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు- ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది.

Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018
ఉత్తేజిత
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
దినపత్రిక

# సంపాదకీయం

## బిసి రిజర్వేషన్లు...స్థానిక ఎన్నికల సమరం !

బిసి రిజర్వేసన్లు, స్థానిక ఎన్నికల చుట్టూ ఇప్పుడు తెలంగాణ రాజకీయం కేంద్రీకృతం అయ్యింది. ఈ వ్యవహారంలో అధికార కాంగ్రెస్ రెండాకులు ఎక్కువే చదివింది. రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని కులగణన చేపట్టిన, బిసి రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ప్రతిపాదించింది. బిసిల ఉద్యమాన్ని నెత్తికెత్తుకునే క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఎందుకంటే పదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడు కనిపించని నిఆదం కాంగ్రెస్ రాగానే అందుకుంటే ఫలితం ఇవ్వలేదు. ఇది కేవలం రాజకీయ ఎత్తుగడగా ప్రజలకుకూడా అర్థం అయ్యింది. మొత్తంగా ఇప్పుడు బిసి రిజర్వేషన్ల పేటెంట్ కాంగ్రెస దక్కించుకుంది. దీనిని ప్రధాన ఎజెండగా చేసుకుని అడుగులు వేస్తోంది. విపక్ష పార్టీలకు సవాళ్లు విసురుతోంది. అయితే స్థానిక ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటు రిజర్వేషన్ల అమలు లో వేగం పెంచింది. ఇటీవలే కేబినేట్‌లో ఆర్డనెన్స్ తెచ్చేందుకు ఆమోదించింది. కొత్తగా రేషన్ కార్డులు జారీ ప్రక్రియను వేగం చేసింది. అలాగే సన్నబియ్యం, రైతుభరోసా వంటి కార్యక్రమాలు చేసింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా కావడం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటం తో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆ లోపే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్ల విషయంలో తన నిబద్ధతను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని అధికార కాంగ్రెస్ ఇప్పటికే ఎదురుదాడి ప్రారంభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశామని అంటున్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవరైనా కోర్టుకు వెళ్తే.. వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్ధండులైన న్యాయవాదులను నియమిస్తామని సిఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని, పెట్టించిన వాళ్లని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలని బీసీ నేతలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని ఆకాంక్షించారు. అంటే మొత్తంగా మెజార్టీ ప్రజలను తమ బుట్టలో వేసుకోవడానికి కాంగ్రెస్ ఎత్తుగడలు వేసిందనే చెప్పాలి. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని సీఎం రేవంత్ రెడ్డి సహా పార్టీ నేతలు విమర్శించారు. బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్. కృష్ణయ్య ఈ రిజర్వేషన్లను సాధించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాని మోదీ స్థానంలో రాహుల్ గాంధీ ఉండి ఉంటే.. 48 గంటల్లో తాను రిజర్వేషన్ల ను సాధించుకువచ్చేవారమని అంటున్నారు. రిజర్వేషన్ల అంశంపై మోదీని తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు ప్రశ్నించాలని, బీజేపీ నాయకులు తమ నిబద్ధతను చాటుకోవాలని సవాళ్లు విసురు తున్నారు. ఓ రకంగా బిజెపిని ఇరుకున పెట్టాలన్న ఎత్తుగడతో ఇదంతా చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని పంచాయతీరాజ్ చట్టం చేసిందని కూడా బిఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నారు. కవిత ఆనాడు ఎందుకు ఉద్యమించలేదని నిలదీస్తున్నారు. ఆ చట్టంలో పేర్కొన్న 50 శాతం నిబంధనను సవరిస్తూ తాము ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తున్నామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది తామేనని అంటున్నారు. వంద ఏండ్ల బీసీల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని, బీసీ రిజర్వేషన్లు గొప్ప కార్యక్రమమని అభివర్ణించారు. ఆనాడు దళితులు, వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారని గుర్తు చేశారు. కులగణన పైన ఎన్నో అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించామని, ఏడాది లో పూర్తి పారదర్శకంగా, పక్కాగా కులగణన పూర్తి చేశామని ప్రకటించారు. ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించుకున్నామని, అసెంబ్లీతోపాటు అన్ని వర్గాలతో కులగణన పైన చర్చించి, అందరి అభిప్రాయాలను తీసుకున్నామని వివరించారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహించామని ప్రకటిచుకున్నారు. వ్యక్తులు స్వయంగా తమ వివరాలను డిక్లేర్ చేశారని, కులగణన డేటాను 100 శాతం డిజిటలైజేషన్ చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో ఎవరూ చాలెంజ్ చేయడానికి వీలు లేకుండా డేటాను భద్రపరిచామని వెల్లడించారు. దేశంలోనే తెలంగాణ కులగణన ఒక బెస్ట్ మోడల్ అని పేర్కొంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదని ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి వివిధ పథకాలతో పాటు, బిసి రిజర్వేషన్ల అమలుపైనే కాంగ్రెస్ ఎజెండా సాగుతోంది. స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ దిశగా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్, బిజెపిలు దీనిని అధిగమించి ఎలా సాగుతారన్నది చూడాలి.

## గ్రామాల్లో స్థానిక సంబరం

హైదరాబాద్: స్థానిక ఎన్నికల సమరంపై కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. బిసి రిజర్వేషన్లు తమను గట్టెక్కిస్తాయని చాలామంది భావిస్తున్నారు. గ్రామస్థాయిలో బిసి నేతలంతా ఇప్పుడు కాంగ్రెస్ జెండా పట్టుకుని ఊరేగుతున్నారు. గ్రామాల్లో ఇంకా బిఆర్ఎస్ పార్టీ కేడర్ బలంగా ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఊపుతో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలతో స్థానిక ఎన్నికల పోరాటం హోరాహోరీగా ఉండనుంది. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చామనే అంశంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుంది. రిజర్వేషన్లతో పాటు రైతులకు రుణమాఫీ, రైతుభరోసా వంటి కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ఇప్పటికే ప్రచారం చేసుకుంటోంది. కేడర్ కూడా ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. గ్రామాల్లో ఇప్పటికే ఎవరు దేనికి పోటీ చేస్తున్నారో ఖరారు చేసేసుకుంటున్నారు. సర్పంచ్ ఎన్నికలకు మాత్రం పోటీ విపరీతంగా పెరిగింది. అలాగే బీఆర్ఎస్ తమకున్న కేడర్, గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని అభిప్రాయపడుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తరచూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశర చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యే పక్షంలో తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఇక గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రత్యామ్నాయ పార్టీగా ఎదగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఉపకరిస్తాయని ఆ పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంకును సద్వినియోగం చేసుకుని.. సరైన అభ్యర్థులను నిలిపితే ఫలితం ఉంటుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తుపై కాకుండా నిర్వహిస్తారు. పరిషత్ ఎన్నికల్లో మాత్రం పార్టీ గుర్తులు ఉంటాయి. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ముందుగా పరిషత్ ఎన్నికలను నిర్వహించి, ప్రభుత్వ పనితీరుకు గెలుపు అని చెప్పాలని భావిస్తోంది.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తుండగా.. గతంలో రిజర్వేషన్లు తక్కువగా ఉన్న సమయంలోనూ బీసీలు జనరల్ స్థానాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు.

# జిల్లాలోనీ రైతులకు పంటల బీమా పథకంపై అవగాహన కల్పించాలి : జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

### పంటల భీమ పథకం గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా జాయింట్ కలెక్టర్

తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,జూలై 15:





ఖరీఫ్ - 2025-26 సంవత్సరమునకు గాను రైతులు స్వచ్ఛందంగా పంటల భీమా కొరకు నమోదు చేసుకోవచ్చునని, రైతులందరికీ అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ అధికారులతో పంటల బీమా పథకంపై డి ఎల్ ఎం సి కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి రైతు ఈ పంటల భీమ పథకాలను సద్వినియోగం చేసుకొనేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ 2025 కు గాను, రెండు పంట భీమా పథకాలు అమలులో ఉన్నాయని వాటిని గూర్చి వివరిస్తూ

1. %PMFBY% (ప్రధానమంత్రి ఫషల్ భీమా యోజన)-దిగుబడి ఆధారంగా తిరుపతి జిల్లా లో ఈ పథకం క్రింద రెండు పంటలు ఖరీఫ్ కాలానికి నోటిఫై చేయబడినవి-వరి మరియు సజ్జ పంటలు అని తెలియజేసారు. వరి పంటకు గ్రామాన్ని భీమా యూనిట్ గా మరియు సజ్జ పంటకు జిల్లాను భీమా యూనిట్ గా పరిగణిస్తామని అన్నారు. తిరుపతి జిల్లా లో ఫ్యూచర్ జెనెరలి అనే కంపెనీ అమలు చేయు ఏజెన్సీ గా ఉండునని అన్నారు. వరి పంటకు- సమ్ ఇన్సూరెడ్: రూ.105000. ఒక హెక్టారుకు. రైతు కట్టవలసిన ప్రీమియం సొమ్ము రూ.420 హెక్టారుకు లేదా రూ.168 ఒక ఎకరానికి బీ లిసజ్జ పంటకు- సమ్ ఇన్సూరెడ్ : రూ.40000 ఒక హెక్టారుకు, ప్రీమియం సొమ్ము రూ.160 హెక్టారుకు లేదా రూ.64 ఒక ఎకరానికి. రైతులు ప్రీమియం చెలించవలసిన చివరి తేదీలు : వరి పంట కొరకు - 15-08-2025., సజ్జ పంటకు- 31-07-2025.

2. %RWBCIS% ( పునర్నిర్మించిన వాతావరణ పంటల బీమా పథకం): తిరుపతి జిల్లాలో ఈ పథకం క్రింద వేరుశనగ మరియు నిమ్మ పంటలు నోటిఫై చేయడం జరిగిందని, మరియు మండలాన్ని ఇన్సూరెన్స్ యూనిట్ గా నిర్ణయించారని అన్నారు. వేరుశనగ పంటకు-సమ్ ఇన్సూరెడ్: రూ.70000 ఒక హెక్టారుకు బీ రైతు చెల్లించవలసిన ప్రీమియం సొమ్ము రూ.1400 హెక్టారుకు లేదా రూ.560 ఒక ఎకరానికి. చివరి తేదీ: 15-07-2025. నిమ్మ పంటకు-సమ్ ఇన్సూరెడ్ రూ.125000, ప్రీమియం సొమ్ము-రూ.6250 హెక్టారుకు లేదా రూ.2500 ఒక ఎకరానికి. చివరి తేదీ: 15-07-2025.రైతులు భీమా కొరకు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ (%NCIP%) నందు ఖరీఫ్ 2025 నుండి నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

బ్యాంకు నందు జూన్ 2025 మాసం నుండి పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంక్ సిబ్బంది పంటకు ఇచ్చిన రుణం నుండి ప్రీమియం సొమ్ము భీమా కొరకు జమచేయుదురని, పంట భీమా వద్దు అనుకున్న రైతులు ఒక అప్లికేషన్ లో బ్యాంక్ వారికి చివరి తేదీకి వారం ముందే సమర్పించవలెనని, తరువాత బ్యాంక్ వారు ప్రీమియం సొమ్మును అమలు చేయు కంపెనీకి జమ చేయుదురని అన్నారు.

పంట రుణం తీసుకోనటువంటి రైతులు , కామన్ సర్వీస్ సెంటర్(%జూజ%) ద్వారా లేదా స్వయంగా %చీజఖూ% పోర్టల్ నందు నమోదు చేసుకోగలరని అన్నారు. నమోదు చేసుకోవడానికి 1.ఆధార్ కార్డ్ కాపీ, 2. యజమాని భూమి పత్రాలు, 3.కౌలు రైతులు ఐతే సి.సి.ఆర్.సి. పత్రం, 4.రైతు డిక్లరేషన్ లేదా పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం -రైతు సేవా కేంద్రం నందు, వ్యవసాయ సిబ్బంది జారీ చేయుదురు మరియు ఇ-పంట నందు నమోదు చేసుకొన్న పత్రం.5. మొబైల్ నెంబర్, 6.రైతు యొక్క సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ మొదటి పేజీ కాపీలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

# 17న ముఖ్యమంత్రి మల్యాల పర్యటన.

### హంద్రీనివాకు నీటిని విడుదల చెయ్యనున్న ముఖ్యమంత్రి

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.నందికొట్కూరు ఎమ్మెల్యే.

నందికొట్కూరు







నంద్యాల జిల్లా నందికొట్కూరు నియో జకవర్గం నందికొట్కూరు మండలం మల్యాల వద్ద హంద్రీనీవా సుజల ప్రవంతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలినకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 17న గురువారం పర్యటించానున్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టులో భాగంగా మల్యాల నుంచి ఫేజ్ 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తూ చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను పరిలించిన అనంతరం మల్యాల పంపు హౌస్ వద్ద కృష్ణా జలాలకు జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. హంద్రీనీవా సుజల ప్రవంతి ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఈ ఈ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తేజ, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఆత్మకూరు డియస్పీ రామాంజి నాయక్, ఏర్పాట్లను పరిశీలించారు. మోటార్ పంపులను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రెండవ పంపు ద్వారా నీటిని వదలి ట్రయల్ రన్ నిర్వహించారు. 6,9పంపుల ద్వారా నీటి విడుదల కు సిద్ధం చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు పట్టణంలో విజిలెన్స్ తనిఖీ లు...!

### అనుమతులు లేని ఎరువులను రైతులకు విక్రయిస్తే చర్యలు.

### 20మీట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత.

నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జులై 15




అనుమతులు లేని ఎరువులను, విత్తనాలను డీలర్లు రైతులకు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని విజిలెన్స్ అధికారి ఏడీఏ ప్రసాద్ అన్నారు. నందికొట్కూరు పట్టణంలో ఎరువులు, పురుగు మందుల, విత్తనాల షాపు లలో మంగళవారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ తనిఖీ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. చిత్తూరు జిల్లా ఏడీఏ ఏ యం ఈ ప్రసాద్, అనంతపురం జిల్లా విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, నందికొట్కూరు ఏడీఏ గిరీష్, మండల వ్యవసాయ అధికారి షేక్షావలి లు షాపులతో పాటు గోదాములను తనిఖీ చేశారు. తనిఖీ లో భాగంగా ఎరువుల నిల్వల స్టాక్ రిజిస్టర్లను, అనుమతి పత్రాలను పరిశీలించారు. నందికొట్కూరు పట్టణంలో సరైన పత్రాలు లేని 20మీట్రిక్ టన్నుల 10-26-26కాప్లెక్స్ ఎరువులు రూ. 6.88లక్షలు విలువగల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విజిలెన్స్ మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు రెండు తనిఖీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు, నందికొట్కూరు లో రెండు రోజులుగా తనిఖీ లు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు డివిజన్ లోని కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలంలో తనిఖీ నిర్వహించి రూ. 17 లక్షలు విలువగల 63మీట్రిక్ టన్నుల ఎరువులు అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే నందికొట్కూరు డివిజన్ లోని పగిడ్యాల, జూపాడు బంగ్లా, మిడుతూరు మండలంలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించిన, కృత్రిమ కొరత సృష్టించిన అలాంటి డీలర్ల పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. అలాగే డీలర్ల లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం లో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, జూలై 15.



తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి ఈవో శ్రీ జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ, సంవత్సరంలో నాలుగు సార్లు అనగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. కాగా, స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ భాను ప్రకాష్ రెడ్డి, శ్రీ నరేష్ కుమార్, శ్రీ శాంతా రామ్, శ్రీ సదా శివరావు, శ్రీ జంగా కృష్ణ మూర్తి, శ్రీమతి జానకి దేవి, శ్రీ మహేందర్ రెడ్డి, సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, జూలై 15.



అక్టోబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను జూలై 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూలై 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జూలై 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూర వుతాయి.

**22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, వార్షిక పుష్పయాగం టికెట్లను జూలై 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. 22న వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను జూలై 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగప్రదక్షిణం టోకెన్లు**

అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జూలై 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా**

శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను జూలై 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను జూలై 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూలై 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదలఠా**

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను జూలై 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.inవెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి :



అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, అన్నారు. మండలంలోని ఆర్ కొత్త పల్లె,ఆర్ బుక్కాపురం ,అంబాపురం,గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ మద్దిలేటి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్న లక్ష్మి,పోలూరు రాఘవరెడ్డి, భీమేశ్వర్ రెడ్డి,పాల శేఖర్,గ్రామాల నాయకులు సర్పంచ్ నాగరాజు,చిన్న మునీశ్వర్ రెడ్డి,లక్ష్మన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో పేద ప్రజల అభ్యున్నతికి పెద్దపీట: ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పేద ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండలం కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాలలో మండల కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే గ్రామాలలో పల్లె పండుగల ద్వారా సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, మండల వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ కల్పించి బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అనంతరం సింగవరం గ్రామంలో శాశ్వత డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అలాగే గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని కోరారు. అనంతరం గ్రామంలో శాశ్వత మంచి నీటి పథకం ద్వారా ప్రజలకు మినరల్ వాటర్ అందించాలని ఎమ్మెల్యేలు కోరారు. అనంతరం ముడుమాల గ్రామంలో ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎస్సీ కాలనీలో శాశ్వత మురుగు కాలువల నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేకి తెలిపారు.

**పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే:**

సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఎంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా 13 వేల రూపాయలు తల్లుల ఖాతాలో జమ అయ్యాయని ప్రధానోపాధ్యాయురాలని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పనితీరు సరిగా లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు.




# బేతంచర్లలో అర్థనగ్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

బేతంచర్ల :ఉత్తేజిత ప్రతినిధి :

తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బేతంచర్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం అర్థనగ్న ప్రదర్శన ధర్నా చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వై ఎల్లయ్య, మండల కార్యదర్శి మధు శేఖర్, మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు నెలకు 26 వేల జీతం ఇవాళ అన్నారు. కార్మికుడు మృతి చెందుతే 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా కుటుంబ సభ్యులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు కాశి, నాగన్న, అఖిలు,విజయ్,శ్రీను,రాజు,మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి శ్రీ వీరుపాక్షి రెడ్డి గారి సతీమణి శ్రీమతి గొల్ల ఆనందమ్మ గారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ , రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ .**



కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి

ఎమ్మిగనూరు జులై 15 మంగళవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి శ్రీ వీరుపాక్షి రెడ్డి గారి సతీమణి శ్రీమతి గొల్ల ఆనందమ్మ అనారోగ్యంతో కర్నూల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం తుది శ్వాస విడిచారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ ,రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ . ఈ విషయాన్ని తెలుసుకొని ఆమె స్వగ్రామమైన ముగితి గ్రామంలో ఆమె పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వీరుపాక్షి రెడ్డి గారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా,నియోజకవర్గ, పట్టణ,మండల,గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కూటమి ఏడాది పాలనలో అభివృద్ధికి పెద్ద పీట

ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

ఉత్తేజిత ప్రతినిధి. నందికొట్కూరు జూలై 15



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన“సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం” కార్యక్రమంలో భాగంగా మంగళవారం జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు గ్రామంలో డీసీ కమిటీ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా గ్రామాలు అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా అరాచక ప్రభుత్వం పక్కదారి పట్టించిదని, స్థానిక సంస్థలకు విలువలేకుండ చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించడంతోపాటుగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్,టీడీపీ నాయకులు గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, రమణారెడ్డి, గోపాల్ రెడ్డి, జంగాల పెద్దన్న, రవి కుమార్, రవికాంత్, నాగరత్నం, మహిళ నాయకురాలు ప్రసన్న లక్ష్మి , శాలు భాష, రామ్మోహన్ రెడ్డి, దేవసహాయం, రసూల్, శంకర్ గౌడ్, గొల్ల శేఖర్, మహమ్మద్ భాషా, ఉస్మాన్, మహబూబ్ బాషా, శేఖర్ గౌడ్, ప్రభుత్వ అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణంలో శివారు ప్రాంతంలో కరెంటు కోతలు తక్షణమే ఆపాలి నాణ్యమైన విద్యుత్తు అందించాలి సిపిఎం డిమాండ్



కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి

ఎమ్మిగనూరు జులై 15 మంగళవారం పట్టణంలో శివారు ప్రాంతంలో పేదలకు కరెంటు కోతలు గంట గంటకు కోతలు అధికమయ్యాయని కాబట్టి విద్యుత్ అధికారులు తక్షణమే కోతలు లేకుండా ప్రజలకు విద్యుత్ అందించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శివన్న నగర్ ఎన్టీఆర్ కాలనీ సచివాలయ అడ్మిన్ అధికారులకు సిపిఎం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ నాయకులు బి రాముడు కే కృష్ణ మాట్లాడుతూ చేనేత పూరి ప్రసిద్ధిగాంచిన పట్టణంలో కూటమి ప్రభుత్వం శివారు ప్రాంతము ప్రజలకు చేనేత కార్మికులకు కోతలు లేకుండా కరెంటు సప్లై చేయాలని సిపిఎం పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు కరెంటు ఖాతాదారులు బిల్లు చెల్లించడంలో ప్రథమ స్థానంలో ఉన్న ప్రజలకు పగలనక రాత్రి అనక కరెంటు కోతలు అధికమయ్యాయని తెలిపారు కరెంటు బిల్లు వసూలు చేయడంలో శ్రద్ధ వహిస్తున్న అధికారులు విద్యుత్తు అందించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని అలాగే 20 సంవత్సరముల నుండి ఉన్నటువంటి విద్యుత్తు లైన్లను మార్చుకున్న జాయింట్లు మరమ్మత్తులు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని దీనివల్ల మరభత్తులు అదికమవుతున్నాయని మరమ్మత్తులు పేరుతో కరెంటు కోతలు లైన్మెన్లు చేస్తున్నారని తెలిపారు పై స్థాయి అధికారులు ప్రతి లైన్ ను పర్యవేక్షణ చేయాలని నాణ్యమైన వైర్లు వేయించి ప్రజలకు విద్యుత్తు అందించాలని సిపిఎం నాయకులు కోరారు ఎటువంటి సమాచారం లేకుండా కోతలు ప్రజలతో ఆందోళన చేస్తామని సిపిఎం నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మోహన్ షేక్షావలి రంగన్న బాబు తదితరులు పాల్గొన్నారు

# బిసి రిజర్వేషన్లు...స్థానిక ఎన్నికల సమరం !

బిసి రిజర్వేసన్లు, స్థానిక ఎన్నికల చుట్టూ ఇప్పుడు తెలంగాణ రాజకీయం కేంద్రీకృతం అయ్యింది. ఈ వ్యవహారంలో అధికార కాంగ్రెస్ రెండాకులు ఎక్కువే చదివింది. రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని కులగణన చేపట్టిన, బిసి రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ప్రతిపాదించింది. బిసిల ఉద్యమాన్ని నెత్తికెత్తుకునే క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఎందుకంటే పదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడు కనిపించని నిఆదం కాంగ్రెస్ రాగానే అందుకుంటే ఫలితం ఇవ్వలేదు. ఇది కేవలం రాజకీయ ఎత్తుగడగా ప్రజలకుకూడా అర్థం అయ్యింది. మొత్తంగా ఇప్పుడు బిసి రిజర్వేషన్ల పేటెంట్ కాంగ్రెస దక్కించుకుంది. దీనిని ప్రధాన ఎజెండగా చేసుకుని అడుగులు వేస్తోంది. విపక్ష పార్టీలకు సవాళ్లు విసురుతోంది. అయితే స్థానిక ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటు రిజర్వేషన్ల అమలు లో వేగం పెంచింది. ఇటీవలే కేబినేట్‌లో ఆర్డనెన్స్ తెచ్చేందుకు ఆమోదించింది. కొత్తగా రేషన్ కార్డులు జారీ ప్రక్రియను వేగం చేసింది. అలాగే సన్నబియ్యం, రైతుభరోసా వంటి కార్యక్రమాలు చేసింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా కావడం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటం తో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆ లోపే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్ల విషయంలో తన నిబద్ధతను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని అధికార కాంగ్రెస్ ఇప్పటికే ఎదురుదాడి ప్రారంభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశామని అంటున్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవరైనా కోర్టుకు వెళ్తే.. వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్ధండులైన న్యాయవాదులను నియమిస్తామని సిఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని, పెట్టించిన వాళ్లని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలని బీసీ నేతలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని ఆకాంక్షించారు.

# మీ ఎముకలు గుల్లే

చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కూల్ డ్రింక్స్ చాలా ఇష్టంగా తింటూ ఉంటారు. దప్పిక తీరుతుందని చల్లగా ఉండే పానీయాన్ని గడ గడ తాగేస్తుంటారు. ఇంటికి అతిథులు వచ్చినా, మనం టూర్లకు వెళ్లినా.. కూల్ డ్రింక్ కచ్చితంగా ఉండాలి. అయితే.. కూల్ డ్రింక్స్‌లో చక్కెర ఎక్కువగా ఉంటుంది తప్ప ఎలాంటి పోషకాలు ఉండవు. ఈ పానీయాలు కేవలం బరువు పెంచుతాయి తప్ప... ఎలాంటి ప్రయోజనాలు ఉండవు అని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ చేసిన అధ్యయనంలో తేలింది. మితిమీరి కూల్ డ్రింక్స్ తాగే పురుషులకు గుండె జబ్బు వచ్చే ప్రమాదం 20 శాతం వరకు పెరుగుతుంది. శీతల పానీయాలు తాగే పిల్లలు ఏటా 3 – 5 కిలోల బరువు పెరుగుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. ఈ పానీయాలలోని యాసిడ్స్ దంతాల ఎనామిల్‌కు హాని కలిగిస్తాయి, ఇది దంత సమస్యలను కలిగిస్తుంది. ఇంకా, వాటిలోని కెఫిన్ నిద్రలేమికి దారితీస్తుంది. కార్బోనేటేడ్ కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా సూచించారు. వీటిలోని ఫాస్పోరిక్ యాసిడ్ ) ఎముకలు, శరీరంలోని ఇతర భాగాల నుంచి కాల్షియంను లీచ్ చేస్తుంది, ఇది కాల్షియం లోపానికి దారి తీస్తుంది. దీన్నే హైపోకాల్సెమియా అని పిలుస్తారు. ఎముకల ఆరోగ్యానికి హాని చేసే పోషకాలు గురించి పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో షేర్ చేసుకున్నారు. మెగ్నీషియం ఎముకల నిర్మాణంలో భాగం అవుతుంది, ఇది ఎముకలను బలోపేతం చేయడానికి కీలక పాత్ర పోషిస్తుంది.





పొటాషియం.. ఇది మూత్రపిండాలలో కాల్షియం ఆరోగ్యకరమైన సంతులనాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది, ఇది ఎముకలు నష్టం నుంచి రక్షిస్తుంది, శరీరంలో యాసిడ్-బేస్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.
విటమిన్ సి.. పండ్లు కూరగాయల్లో సమృద్ధిగా లభించే విటమిన్ సి.. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది, ఎముకలు విరిగిపోకుండా కాపాడుతుంది.
ఫాస్ఫరస్.. ఎముకల పెరుగదలకు ఫాస్ఫరస్ ముఖ్యమైనది, ఎముకల అభివృద్ధికి తగినంత ఫాస్ఫరస్ తీసుకోవడం చాలా ముఖ్యం. తక్కువ సీరం ఫాస్ఫేట్ స్థాయిలు పోషకాహార లోపాన్ని సూచిస్తాయి, ఇది ఎముకల పగుళ్లు, బోలు ఎముకల ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ కె.. ఆకు కూరలలో ఉండే విటమిన్ కార్బాక్సిలేషన్ అనే ప్రక్రియ ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. ఇది ఎముక ప్రోటీన్‌లను సక్రియం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 200 కంటే ఎక్కువ ఎంజైమ్‌లలో కీలకమైన భాగం. కొల్లాజెన్ సంశ్లేషణ, ఎముక ఖనిజీకరణకు ఇది అవసరం. తగినంత ప్రోటీన్ తీసుకోవడం వల్ల కాల్షియం శోషణను మెరుగుపడుతుంది, ఇన్సులిన్ లాంటి గ్రోత్ ఫ్యాక్టర్ 1 స్రావాన్ని పెంచుతుంది, లీన్ బాడీ మాస్‌ను ప్రోత్సహించి ఎముక ఆరోగ్యాన్ని సానుకూలంగా ప్రభావితం చేస్తుంది. ఆరోగ్యాన్ని దెబ్బతీసే కూల్ డ్రింక్స్‌కు బదులుగా పుచ్చకాయ, కర్బూజ పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. వీటిలోనూ చక్కెర లేకుండా తాగితే మరీ మంచిది. సాధ్యమైనంత వరకు మంచి నీటిని ఎక్కువగా తాగేందుకు ప్రయత్నించాలి.





# పిల్లలకి అస్సలు పెట్టొద్దు..

ఆహారం అనేది ఆరోగ్యం విషయంలో కీ రోల్ పోషిస్తాయి. ఈ నేపథ్యంలోనే పిల్లలకి ఇచ్చే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుల కోసం ప్రతి పేరెంట్ ఎన్నో విధాలుగా ఆలోచిస్తారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో ఆహారం కీ రోల్ పోషిస్తుంది. అయితే, కొన్ని ఫుడ్స్ పిల్లలకి అస్సలు మంచిది కాదు. వీటిని తీసుకోవడం వల్ల పిల్లలకి జ్ఞాపకశక్తిని మందగించి, బ్రెయిన్‌ని బలహీనపరుస్తాయి. అవేంటో తెలుసుకోండి.
కలర్ ఫుడ్స్.. రంగురంగుల ఫుడ్స్ జిలేబీలు, రంగుల స్వీట్స్, పొడి షుగర్ ఫుడ్స్ ఆహారాలలో ఆర్టిఫీషియల్ కలర్స్ ఉంటాయి. దీని వల్ల పిల్లల్లో ఆందోళన, తలనొప్పి, హైపర్ యాక్టివిటీ, అభిజ్ఞా సమస్యలు వస్తాయి.
మెదడు అభివృద్ధిపై ట్రాన్స్‌ఫ్యాట్స్.. ట్రాన్స్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే ఆహారం మెదడు ఆరోగ్యం, అభివృద్ధిపై నెగెటివ్ ఎఫెక్ట్‌ని చూపిస్తాయి. ఈ కొవ్వులు ఎక్కువగా ఫ్రై చేసిన ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్, హైడ్రోజనేటెడ్ నూనెలతో ప్రాసెస్డ్ ఫుడ్స్ ఉంటాయి. ఇలాంటి ఫుడ్స్ పిల్లల మెదడులో వాపుని పెంచుతాయి. అదనంగా, ఇది రసాయనిక సెరటోనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీని ప్రభావం డిప్రెషన్, మెమరీలాస్‌కి దారికతీస్తుంది.
కెఫిన్.. చాలా మంది కాఫీలో మాత్రమే కెఫిన్ ఉంటుందనుకుంటారు. కానీ, చాక్లెట్స్, టీ, కాఫీల్లోనూ కెఫిన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జలుబు వంటి సమస్యలు వస్తాయి. అంతేకాకుండా మరిన్ని సమస్యలు కూడా వస్తాయి. పిల్లలు రోజుకి 45 మిల్లీగ్రాముల వరకూ కెఫిన్ ఎక్కువగా ఉండే ఫుడ్స్‌ని తీసుకోవచ్చు. కెఫిన్ డ్రింక్స్ తీసుకుంటే వణుకు, భయం, నిద్రలేమి, హైపర్‌యాక్టివ్, తలనొప్పి, కడుపునొప్పులు వస్తాయి. ఇవన్నీ వారి మానసిక అభివృద్ధిని ప్రభావితం చేస్తాయి.
షుగర్ ఫుడ్స్.. పిల్లలకి షుగర్ ఫుడ్స్ అంటే ఇష్టం. కానీ ఈ స్వీట్స్ పిల్లల బ్రెయిన్ హెల్త్‌కి మంచిది కాదు. స్వీట్స్, ఐస్‌క్రీమ్స్, కేక్స్, బేబీ ఫుడ్స్‌లో చక్కెర చాలా ఉపయోగించబడుతుంది. దీని వల్ల హైపర్ యాక్టివిటీకి కారణమవుతుంది. పిల్లల ఆకలిని ప్రభావితం చేస్తుంది.
పిల్లలు ఇష్టపడే స్నాక్స్.. పిల్లలు ప్యాకేజ్డ్ చిప్స్, బర్గర్స్, పిజ్జా, నూడుల్స్ ఇలాంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ వారి మూడ్ స్వింగ్స్, ప్రవర్తనల్లో మార్పులతో పాటు తలనొప్పి, హైపర్ యాక్టివిటీ సమస్యలని పెంచుతాయి. వీటిని తీసుకోవడం వల్ల వారిలో సామర్థ్యం తగ్గుతాయి.











# మొటిమల మాయం...

ముఖ సౌందర్యాన్ని రెట్టింపు చేయడంలో పసుపుది కీలక పాత్ర. పసుపులోని యాంటీ ఎలర్జిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ సెప్టిక్, యాంటీ మైక్రోబియల్, యాంటీ ప్యారసైటిక్, యాంటీఆక్సిడెంట్ గుణాలు.. చర్మ సమస్యలను దూరం చేస్తాయి. అందుకే ఫేస్‌ప్యాక్, స్క్రబ్.. వంటివి తయారుచేసే క్రమంలో దీన్ని విరివిగా వాడుతుంటాం. అలాగే పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్ వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు సౌందర్య నిపుణులు.
మొటిమలు, మచ్చలను మాయం చేస్తుంది..! మొటిమల సమస్యతో బాధపడేవారికి పసుపు ఎసెన్షియల్ ఆయిల్.. గొప్ప ఔషధంలా పని చేస్తుంది. పసుసు వేళ్ల నుంచి తీసిన ఎసన్షియల్ ఆయిల్‌లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మొటిమల సమస్యను దూరం చేయడమే కాకుండా.. వాటి వల్ల వచ్చిన మచ్చలను మాయం చేస్తుంది. రాత్రి పూట పసుపు నూనెను ముఖానికి అప్లై చేసుకుని, ఉదయం శుభ్రం చేసుకుంటే.. మొటిమల సమస్య దూరం అవుతుంది. పాదల పగుళ్లు తగ్గిస్తుంది.. పసుపు అద్భుతమైన హీలింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. మీరు కాళ్ల పగుళ్లతో బాధపడుతుంటే.. పసుపు నూనె గొప్ప ఔషధంలా పనిచేస్తుంది. మీకు కాళ్ల పగుళ్లు ఉంటే.. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెలో కొన్ని చుక్కల పసుపు నూనెను వేసి మిక్స్ చేసి రాత్రి నిద్రపోయే ముందు కాళ్లకు అప్లై చేసుకోండి. ఇలా రోజూ చేస్తూ ఉంటే కాళ్ల పగుళ్లు తగ్గుముఖం పడతాయి. వృద్ధాప్య ఛాయలు దూరం.. పసుపు ఎసెన్షియల్ ఆయిల్‌లో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. దీని కోసం నాలుగు చెంచాల బాదం నూనెలో నాలుగు చుక్కల పసుపు ఎసెన్షియల్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో ముఖంపై సన్నని గీతలు, ముడతలు ఉన్నచోట మృదువుగా రుద్దుకోవాలి. తర్వాత ఒక టిష్యూ పేపర్ తీసుకొని ఎక్కువ్వెన నూనెని తుడిచేసుకోవాలి. ఈ చిట్కాను రాత్రి పడుకొనే ముందు రోజూ పాటించడం ద్వారా వృద్ధాప్య ఛాయలు కనుమరుగవుతాయి.
చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.. చర్మం తాజాగా ఉండటానికి... ఒకటిన్నర చెంచా ఆలివ్ ఆయిల్‌లో పసుపు వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్ ఒక్క చుక్క వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై రాసుకుని మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా రోజూ రాత్రి పడుకొనే ముందు చేయడం వల్ల అలసిన చర్మం తిరిగి తాజాదనాన్ని సంతరించుకుంటుంది.
ఈ జాగ్రత్తలు తీసుకోండి.. పసుపు వేళ్ల నూనెను నేరుగా చర్మం లేదా కురులపై ఉపయోగించకూడదు. కొబ్బరినూనె, బాదం నూనె, జొజోబా ఆయిల్.. వంటి నూనెలతో కలిపి మాత్రమే వినియోగించాలి. అలాగే దీనిని వీల్కెనంత తక్కువ మోతాదులోనే వాడాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఈ నూనెను ఉపయోగించిన తర్వాత చర్మం చాలా సెన్సిటివ్‌గా మారుతుంది. ఫలితంగా సూర్యుడి నుంచి వెలువడే యూవీ కిరణాలను అంతగా తట్టుకో లేదు. ఇది చర్మానికి అప్లై చేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లొద్దు.












# ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు...

ఇందులో మన ఇంట్లో ఉండే ఎన్నో పదార్థాలే చాలా ఆరోగ్య ప్రయోజనాలని ఇస్తాయి. అందులో మెంతులు కూడా ఉన్నాయి. మెంతులని కూరలు, పచ్చళ్ళలో వాడతారు. అంతేకాదు, జుట్టుకి మంచి పోషణని అందించడంలో కూడా మెంతులు ముందుంటాయి. మెంతులు చేదుగా ఉన్నప్పటికీ ఇందులో పోషకాలు, మినరల్స్ శరీరానికి ఎంతో అవసరం. మెంతుల్లో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం.
ఇన్‌ఫ్లమేషన్.. మెంతుల్లో ఎన్నో అణువులు ఉంటాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడంలో సాయపడతాయి. కాబట్టి, గౌట్, ఆస్తమా వంటి సమస్యలతో బాధపడేవారు వీటిని తీసుకోవచ్చు. మెంతుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, నియాసిన్, పొటాషియం, ఐరన్, ఆల్కలాయిడ్స్ కలిగి ఉన్నాయి. అసిడిటీ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే నానబెట్టిన మెంతులు ఓ టీస్పూన్ తీసుకోవడం మంచిది.
జీర్ణక్రియ.. మెంతుల నీటిని తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. దీనిలోని పీచు పదార్థం అజీర్ణం, మలబద్ధకం, వాతాన్ని నయం చేస్తుంది. ఇది ఆహారం నుండి పోషకాలను బాడీ గ్రహిస్తుంది.
షుగర్.. షుగర్ ఉన్నవారికి మెంతులు ఓ గొప్ప ఔషధమని చెప్పొచ్చు. మెంతుల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి కంట్రోల్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. రోజు ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. దీని వల్ల మధుమేహం ఉన్నవారు ఈ నీటిని తాగడం మంచిది. మరీ ముఖ్యంగా నానబెట్టి ఆ నీటిని తాగితే మంచిది.
కొలెస్ట్రాల్ తగ్గడం.. అదే విధంగా, మెంతులను ఫుడ్‌లో చేర్చడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని కరిగిపోతుంది. ముఖ్యంగా రక్తనాళాలల్లో పేరుకుపోయిన కొవ్వుని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని వల్ల కార్డియో వాస్కులర్ వంటి వ్యాధులను దూరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇమ్యూనిటీ.. మెంతుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇమ్యూనిటీ బలపరుస్తుంది. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. మెంతులు వాడడం వల్ల చర్మంతో పాటు జుట్టుకి కూడా మేలు చేస్తాయి.??గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.





# ఈ రసం తాగితే.. షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది..!

బొప్పాయి పండులోనే కాదు, బొప్పాయి ఆకులోనూ పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి ఆకు రసం ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడానికి ఉపయోగించే అత్యంత దేశీ రెమెడీ. దీనిలోని పాపైన్, చైమోపాపైన్ వంటి ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. కడుపుఉబ్బరం, ఇతర జీర్ణరుగ్మతులను నివారిస్తుంది. ఇందులోని ఆల్కలాయిడ్ సమ్మేళనం చుండ్రు, బట్టతల రాకుండా నివారిస్తుంది. బొప్పాయి ఆకులో విటమిన్ ఏ, సి, ఇ, కె, బి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి ఆకు టీ, జ్యూస్, మాత్రలు.. అనారోగ్యాల చికిత్సకు, ఆరోగ్యాన్ని రక్షించడానికి తోడ్పడతాయి. బొప్పాయి ఆకుల జ్యూస్ తాగితే.. ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో చూద్దాం.
డెంగీ చికిత్స చేస్తుంది.. డెంగీ లక్షణాల చికిత్సకు బొప్పాయి ఆకుల రసాన్ని సాధారణంగా ఉపయోగిస్తారు. జ్వరం, అలసట, తలనొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, వాంతులు వంటి డెంగీ లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. డెంగీతోబాధపడుతున్న వందలాది మంది వ్యక్తులపై చేసిన మూడు అధ్యయనాలు.. బొప్పాయి ఆకు సారం రక్తంలో ప్లేట్‌లెట్ స్థాయిలను విపరీతంగా పెంచడంలో సహాయపడినట్లు కనుగొన్నారు.
రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గిస్తుంది.. షుగర్ పేషెంట్స్ బొప్పాయి రసం తాగితే.. దయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది తరచూ తీసుకుంటే.. దయాబెటిస్‌కు ఔషధంగా ఉపయోగపడుతుంది. బొప్పాయి ఆకులలో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు.. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్యాంక్రియాస్‌లోని ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను నష్టం, అకాల మరణం నుంచి రక్షిస్తుంది.
జీర్ణక్రియకు మేలు చేస్తుంది.. బొప్పాయి ఆకు జ్యూస్.. గ్యాస్, ఉబ్బరం, గుండెల్లో మంట వంటి జీర్ణ లక్షణాలను తగ్గిస్తుంది. బొప్పాయి ఆకులో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఇది పెద్ద ప్రోటీన్‌ను చిన్నదిగా, సులభంగా జీర్ణమయ్యే ప్రోటీన్‌లు, అమైనో యాసిడ్‌గా విభజిస్తుంది. ఇది మలబద్ధకం, గుండెల్లో మంట, ప్రకోప ప్రేగు సిండ్రోమ్ వంటి జీర్ణక్రియ సమస్యలను పరిష్కరిస్తుంది.
యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయ్.. బొప్పాయి ఆకుల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులకు చికిత్స చేయడానికి తోడ్పడుతుంది. బొప్పాయి ఆకు సారం ఆర్థరైటిస్‌తో ఉన్న ఎలుకల పాదాలలో మంట, వాపును గణనీయంగా తగ్గిస్తుందని ఒక అధ్యయనం కనుగొంది.
జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.. బొప్పాయి ఆకుల రసాన్ని తలకు అప్లై చేస్తే.. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీరంలో అధిక స్థాయి ఆక్సీకరణ ఒత్తిడి జుట్టు రాలడానికి దోహదం చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల, యాంటీఆక్సిడెంట్-రిచ్ డైట్ తినడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి, జుట్టు పెరుగుదలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
బొప్పాయి రసంలో యాంటీ ఫంగల్ లక్షణాలు.. చుండ్రు సమస్యను నివారిస్తాయి. బొప్పాయి రసాన్ని తాగితే.. మృదువైన, ప్రకాశవంతమైన చర్మాన్ని పొందవచ్చు. బొప్పాయిలో పాపైన్ అనే ప్రోటీన్ కరిగించే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింట్‌గా పనిచేస్తుంది, ఇది ఎక్స్‌ఫోలియేటింట్‌గా పనిచేస్తుంది, తద్వారా దుమ్ము, చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. మొటిమలు రాకుండా నివారిస్తుంది.

# లిక్విడ్ లిప్‌స్టిక్ వేస్తే....



లిప్‌స్టిక్ అనేది పెదాల అందాన్ని రెట్టింపు అవుతుంది. అయితే, ఇందులో లిక్విడ్ లిప్‌స్టిక్ అంటే క్రేజ్ ఉంటుంది.మరి ఈ లిప్‌స్టిక్ ఎలా అప్లై చేయాలి. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తి వివరాలు తెలుసుకోండి.
చాలా మందికి మేకప్ వేసుకోవడం అంతగా ఇష్టం ఉండదు. కానీ, లిప్‌స్టిక్ మాత్రం వేసుకుంటారు. అయితే, అందులో లిక్విడ్ లిప్‌స్టిక్ అంటే చాలా మందికి ఇష్టం. దీనిని పెర్ఫెక్ట్‌గా అప్లై చేయకపోతే చూడ్డానికి అంత బాగోదు. పెదాలపై సరైన విధంగా లిప్‌స్టిక్ అప్లై చేయాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో తెలుసుకోండి.
ముందుగా మాయిశ్చరైజ్ రాయండి.. పెదాలపై లిప్‌స్టిక్ రాయడానికి ముందు మాయిశ్చరైజ్ రాయండి. దీంతో పెదాలు హైడ్రేట్ అవుతాయి. లేకపోతే లిప్‌స్టిక్ సరిగ్గా సెట్ అవ్వదు. కాబట్టి, ముందుగా మాయిశ్చరైజర్ అప్లై చేసి ఆ తర్వాత లిప్‌స్టిక్ రాయండి. అయితే, లిక్విడ్ లిప్‌స్టిక్స్ వేసేటప్పుడు ఇవన్నీ అవసరం లేదు. పెదాలు మరీ గరుకుగా ఉన్నప్పుడు మాత్రమే ఈ లిప్‌స్టిక్‌ని అప్లై చేయండి. అయితే, ఈ లిప్‌స్టిక్ అప్లై చేసే ముందు మాయిశ్చరైజర్‌ని పలుచగా రాయాలి. మీ పెదాల ఆకృతి సరిగ్గా కనిపించాలంటే ముందుగా లిప్‌లైనర్ వాడండి మనం ఏ రంగు లిప్‌స్టిక్ వాడతామో ఆ రంగులో కాస్త సన్నగా ఉండే లిప్‌లైనర్ వాడాలి. అప్పుడు దాంతో పెదాల చుట్టూ లైనింగ్ చేయండి. ఆ తర్వాత లిప్‌స్టిక్ వేయండి. తర్వాత లిప్ లైనర్‌తో రీటచ్ చేయండి. ముఖ్యంగా పెదాల మూలలని సరిచేయండి. అప్పుడు లిక్విడ్ లిప్‌స్టిక్ చాలా ఎక్కువసేపు అందంగా ఉంటాయి.
లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎక్కువగా క్రీమీ పిగ్మెంటేషన్ ఉంటుంది. కాబట్టి, ఇది ఎక్కువగా అప్లై చేయొద్దు. కేవలం ఓ స్ట్రోక్ సరిపోతుంది. రెండు మూడుసార్లు అప్లై చేయాల్సిన అవసరం లేదు. వేశాక కాసేపు ఆరనివ్వండి.
టిష్యూ.. పెదాలపై లిప్‌స్టిక్ మరీ ఎక్కువగా ఉందనిపిస్తే ఓ టిష్యూ వేసి కాస్తా కొద్దిగా నొక్కాలి. అప్పుడు ఎక్కువగా ఉన్న కలర్ పేపర్‌లోకి వెళ్తుంది. మిగిలిన లిప్‌స్టిక్ అలానే ఉంటుంది. అంతేకానీ, గుడ్డతో రుద్దడం, నీటితో కడగడం లాంటి తప్పులు మాత్రం చేయొద్దు. సూట్ అయ్యే కలర్.. మందుగా సరిపోయే లిప్ కలర్ ఎంచుకోండి. ఆపై దానికి సరిపోయే లిప్‌లైనర్ ఎంచుకోండి. సరైన లిప్ లైనర్‌తో సన్నని లిక్విడ్ లిప్‌స్టిక్‌ని వేయండి. అప్పుడు పెదాలు మంచి రంగుతో చూడ్డానికి చక్కగా కనిపిస్తాయి. ఇలా చిన్న చిన్న టిప్స్ పాటిస్తే లిప్స్ చాలా చక్కగా అందంగా కనిపిస్తాయి. అయితే, మీరు లిప్‌స్టిక్ ఎంచుకునేటప్పుడు మంచి బ్రాండ్స్ వేసుకోవడం మంచిది. ఇక మీ డ్రెస్సెస్‌కి సూట్ అయ్యే కలర్స్‌ని ఎంచుకోండి.

# టీవీ సీరియల్‌ను ప్రశంసించిన సీఎం



హైదరాబాద్: రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్–1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టి చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీ ఫిల్మ్ సిటీ దేశానికే గర్వకారణమని, పౌరాణిక గ్రంథాల ఆధారంగా సినిమాలు తీయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఆకాష్ సాగర్ చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్–1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ ముఖ్యమైన కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి( %ూాఅబఎబశ్రీఖ =వఋుత్ష్ర =వఎఎఎ%) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రామోజీ ఫిల్మ్ సిటీలో శ్రీమద్ భాగవతం చిత్రీకరణ జరగడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ దేశంలోనే ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన స్టూడియో అని ఆయన ప్రశంసించారు.

రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పౌరాణిక గ్రంథాలు మన జీవనంలో అంతర్భాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇలాంటి గొప్ప కథలను ప్రస్తుత తరానికి మరోసారి దృశ్యకావ్యం రూపంలో అందించాలనే నిర్ణయం తీసుకున్న నిర్మాతలను ఆయన అభినందించారు. తరం మారుతున్న ఈ తరుణంలో.. ఇలాంటి అద్భుతమైన ఆధ్యాత్మిక కథాంశంతో సినిమా తీయడం గొప్ప విషయమని కొనియాడారు. దాదాపు 40 ఏళ్ల క్రితం టీవీల్లో రామాయణం సీరియల్ వస్తుందంటే.. బయట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయేవని, ప్రజలందరూ టీవీల ముందు కూర్చుని చూసేవారని ఆయన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతలా ఆ సీరియల్ ప్రజాధారణ పొందిందన్నారు.

తెలంగాణలో ఉందని చెప్పడానికి నేను గర్విస్తున్నాను' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఫిల్మ్ సిటీ కేవలం చిత్ర నిర్మాణానికే కాకుండా, పర్యాటకానికి, రాష్ట్ర ప్రతిష్టకు కూడా ఎంతగానో దోహదపడుతుందని ఆయన పరోక్షంగా సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. అలాగే, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందుకోసం ఒక సమగ్రమైన '2047 విజన్ డాక్యుమెంట్'ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ డాక్యుమెంట్‌లో సినీ రంగానికి ఒక ప్రత్యేక అధ్యాయం (చాప్టర్) ఉంటుందని స్పష్టం చేశారు. 'రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ గతంలో ఎంతటి ప్రజాదరణ పొందిందో.. 'శ్రీమద్ భాగవతం పార్ట్–1' కూడా అంతే పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ చిత్రం తెలంగాణలో ఆధ్యాత్మిక చిత్ర నిర్మాణానికి కొత్త ఊపిరి పోస్తుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా సినీ రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు.. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫంక్షన్‌కి ఫైటర్ జెట్ తీసుకెళ్తారేమో..?



తెలంగాణ: మంత్రులు హెలికాప్టర్లను ఆటో రిక్షాలా వాడుతూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సాధారణ ప్రయాణాలకు కూడా లక్షల్లో ఖర్చయ్యే హెలికాప్టర్లు వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సినిమా ప్రారంభోత్సవానికి రామోజీ ఫిల్మ్ సిటీకి హెలికాప్టర్‌లో వెళ్లనుండటంపై తీవ్ర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఈ వ్యవహారంపై కోమటిరెడ్డిని ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేయగా.. కేటీఆర్ దాన్ని రీట్వీట్ చేశారు. తెలంగాణలో కొందరు మంత్రులు హెలికాప్టర్లు వినియోగిస్తున్న తీరుపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతోంది. మంత్రులు హెలికాప్టర్లను ఆటో రిక్షాలా వాడుతున్నారని, అనవసర ప్రయాణాలకు కూడా వాటిని వినియోగిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. సాధారణ రోడ్డు మార్గంలో సులువుగా చేరుకోగలిగే ప్రాంతాలకు కూడా హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

100–200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు కూడా హెలికాప్టర్లలో వెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి. హెలికాప్టర్ల నిర్వహణ, అద్దె ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటాయని.. ఒక గంట హెలికాప్టర్ ప్రయాణానికి లక్షల్లో ఖర్చవుతుందని ఈ వ్యయం మొత్తం ప్రజల పన్నుల నుంచే భరించాల్సి వస్తుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరుతో చేసే హెలికాప్టర్ ప్రయాణాలు కేవలం ప్రచారం కోసమేనని, ఆయా కార్యక్రమాలకు రోడ్డు మార్గంలో వెళ్లినా పెద్దగా సమయం వృథా కాదని వాదిస్తున్నారు.

తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెలికాప్టర్ వినియోగంపైనా చర్చ జరుగుతోంది. సినిమాటోగ్రఫీ మంత్రిగా కూడా ఉన్న కోమటిరెడ్డి ఇవాళ రామోజీ ఫిల్మ్ సిటీ, తిరుమలగిరి పర్యటన కోసం హెలికాప్టర్‌ను ఉపయోగించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సినిమా ప్రారంభోత్సవం వంటి కార్యక్రమానికి ప్రభుత్వ హెలికాప్టర్‌ను వాడటంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ రోజు మధ్యాహ్నం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓ సినిమా ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. అనంతరం.. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తిరుమలగిరిలో పబ్లిక్ మీటింగ్, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ముగించుకొని తిరిగి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు హెలికాప్టర్‌లో రానున్నారు. నగర శివార్లలో ఉన్న రామోజీ ఫిల్మ్ సిటీకి హెలికాప్టర్‌లో వెళ్లడంపైనే ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా యి. మంత్రి హెలికాప్టర్ పర్యటన షెడ్యూల్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సెటైర్లు వేశారు. ఫంక్షన్ ఉంటే ఫైటర్ జెట్ తీసుకెళ్తారేమోనని ఎద్దేవా చేశారు. 'ఇవాళ సినిమా ఓపెనింగ్‌కి హెలికాప్టర్ ? రేపు బర్త్‌డేకి బుల్లెట్ ట్రైన్ ? ఎల్లుండి ఏదైనా ఫంక్షన్‌కి ఫైటర్ జెట్ ? అప్పు పుట్టకపోతే ఏంటి ? తెలంగాణను తాకట్టు పెడుతూ ? ప్రజల రక్తాన్ని పీల్చుతూ రాజభోగాలు అనుభవించడమే కదా కాంగ్రెస్ నైజం?' అని మల్లయ్య యాదవ్ ట్విట్టర్ వేదిగా ప్రశ్నించారు. ఈ ట్వీట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రీట్వీట్ చేయడంతో ఈ అంశం మరింత రాజకీయ రంగు పులుముకుంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఈ విమర్శలకు అధికార పక్షం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## పెద్దపులి సంచారం.. భయంతో స్థానికులు

కామారెడ్డి: జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండాలో పెద్దపులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. తాజాగా ఓ రైతుకు చెందిన ఆవుపై ఎస్–12 అనే పెద్దపులి దాడి చేసింది. గతంలోనూ ఇక్కడ పులుల సంచారం ఉండటంతో ప్రజలు నెలల తరబడి భయంలో గడిపారు. ప్రస్తుతం పగటిపూట కూడా బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టి, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైతులు, పశువుల కాపరులు ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని స్కూల్ తండాలో పెద్దపులి సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. తాజాగా.. తండాకు చెందిన ఓ రైతు ఆవుపై పెద్దపులి దాడి చేయడంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. ఇది ఎస్–12 అనే పెద్దపులిగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

**గతంలోనూ పులుల సంచారం..**

కామారెడ్డి జిల్లా అటవీ ప్రాంతాల్లో పెద్దపులుల సంచారం కొత్తేమీ కాదు. గత కొన్నేళ్లుగా అడపాదడపా పులులు కనిపించడం, పశువులపై దాడులు చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. 2023లో ఇదే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. ఆ సమయంలో ప్రజలు నెలల తరబడి భయం గుప్పిట్లో గడిపారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లాలన్నా.. పశువులను మేపడానికి తీసుకెళ్లాలన్నా.. వెనుకాడే పరిస్థితి ఏర్పడింది. తాజాగా పులి సంచారంతో ప్రజలు పగటిపూట కూడా ఒంటరిగా బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ ఘటనలతో ప్రజల్లో పులి భయం తిరిగి మొదలైంది.

**ట్రాప్ కెమెరాలు ఏర్పాటు..**

ప్రస్తుత దాడి నేపథ్యంలో రామారెడ్డి, మాచారెడ్డి మండలాల అడవుల్లో అటవీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పులి కదలికలను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి పులి సంచారాన్ని పర్యవేక్షించనున్నారు. అటవీ ప్రాంతాల్లోకి వెళ్లే రైతులు, పశువుల కాపరులు ఒంటరిగా వెళ్లొద్దని, గుంపులుగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని, పులి సంచారం గురించి ఏ చిన్న సమాచారం ఉన్నా వెంటనే తెలియజేయాలని కోరారు.పులుల ఆవాసాలను పరిరక్షించడంతో పాటు, మానవ–వన్యప్రాణుల సంఘర్షణను నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక ఈ ఘటనతో రామారెడ్డి మండల ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

## రన్నింగ్ బైక్‌పై రొమాన్స్..



హైదరాబాద్: ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఓ ప్రేమజంట రెచ్చిపోయింది. నడిరోడ్డుపైనే అశ్లీల చేష్టలకు పాల్పడింది. బైక్ ట్యాంక్‌పై కూర్చున్న యువతితో యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసుల పర్యవేక్షణ పెంచాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.ఇటీవల కాలంలో యువ జంటలు బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా రన్నింగ్ బైక్‌లపై అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రమాదకరమైన స్టంట్స్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటుగా చేసుకోవాల్సిన పనులను సైతం నడిరోడ్లపైనే చేయడం, హద్దు మీరి ప్రవర్తించడం వంటివి సమాజంలో చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో చోటు చేసుకున్న ఒక ఘటన ఈ సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఒక యువ జంట బరి తెగించింది. యువకుడు బైక్‌ను నడుపుతూ.. తన ప్రియురాలిని ముందు ట్యాంక్‌పై కూర్చోబెట్టుకుని అభ్యంతరకర రీతిలో ప్రవర్తిస్తూ వీడియో తీసుకున్నారు. వెనకాలో బైక్ ప్రయాణించిన ఓ వాహనాదారుడు వారి రోమాన్స్‌ను సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. నడిరోడ్డుపై ఎవరైనా చూస్తారన్న భయం కూడా లేకుండా ఆ జంట రెచ్చిపోయింది. వాహనదారులను ఏమాత్రం పట్టించుకోకుండా తమ పనిలో నిమగ్నమ య్యారు. ట్రాఫిక్ నిబంధనలను గాలికొదిలేసి ప్రమాదక రంగా ప్రయాణించిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## ఉపాధి హామీ కూలీలకు కొత్త రూల్..

తెలంగాణ: ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరుకు సంబంధించి అవకతవకలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై కూలీల ఫోటోలను రెండు పూటలా తీయడం తప్పనిసరి చేసింది. ఈ విధానం సోమవారం నుంచే అమల్లోకి వస్తుంది. ఫోటోలను పంచాయతీ కార్యదర్శి నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వరకు ధృవీకరించాల్సి ఉంటుంది. అయితే, ఈ కొత్త విధానం వల్ల పనిభారం పెరుగుతుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరులో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. ఉపాధి పనులు చేసేందుకు వచ్చిన కూలీల ఫోటోలను రెండు పూటలా తప్పనిసరిగా తీయాలని ఆదేశాలు జారీ చేసింది. ఒక పూట మాత్రమే ఫోటో తీస్తే.. సదరు కూలీకి ఆ పూటకు సంబంధించిన వేతనం మాత్రమే వస్తుందని స్పష్టం చేసింది. ఈ నూతన విధానం సోమవారం నుంచే అమల్లోకి వస్తుంది. ఇది పథకం అమలులో పారదర్శకతను పెంచుతుందని కేంద్రం భావిస్తోంది.

కేంద్రం అమలులోకి తెచ్చిన ఈ నూతన విధానం ప్రకారం.. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ అవుతున్న ఫోటోలను పంచాయతీ కార్యదర్శుల నుండి రాష్ట్ర స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వరకు నిత్యం ధృవీకరించాల్సి ఉంటుంది. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫోటోల ధృవీకరణ సమయంలో అధికారులు కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం సూచించింది.

మేట్ లేదా ఫీల్డ్ అసిస్టెంట్ సంబంధం లేని ఫోటోను అప్‌లోడ్ చేశారా? పని ప్రదేశంలో తీసిన లైవ్ ఫోటో కాకుండా పాత ఫోటోను అప్‌లోడ్ చేశారా? ఫోటోలో ఉన్న వ్యక్తుల సంఖ్యకు, మస్టర్‌లో హాజరైన వ్యక్తుల సంఖ్యకు తేడా ఉందా? ఫోటోలలో ఉన్న స్త్రీ, పురుషుల సంఖ్య, మస్టర్‌లో హాజరైన స్త్రీ, పురుషుల సంఖ్య సమానంగా ఉన్నాయా? వేర్వేరు మస్టర్లలో ఒకే వ్యక్తులను క్యాప్చర్ చేశారా? ఉదయం తీసిన ఫోటోలలో ఉన్న వ్యక్తులే, మధ్యాహ్నం తీసిన ఫోటోలలో ఉన్నారా, లేక మారారా? అనేది చూసుకోవాలి. అంతే కాకుండా.. మధ్యాహ్నపు ఫోటోను క్యాప్చర్ చేశారా, లేదా? అనేది కూడా చెక్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ విధానం తెలంగాణలోని ప్రతి విలేజ్ సెక్రటరీ నుండి కమిషనర్ వరకు అందరికీ ఈ ధృవీకరణ బాధ్యతలు అప్పగించారు. %చీవీమీ% యాప్‌లో మేట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఉపాధి కూలీల అటెండెన్స్ ఫోటోలన్నింటినీ ప్రతిరోజూ పంచాయతీ కార్యదర్శులు ధృవీకరించి, నివేదికను ఎంపీడీఓకు పంపించాలి. మండల స్థాయిలో.. అన్ని గ్రామాల నుంచి ఒక రోజులో వచ్చిన మొత్తం ఫోటోల్లో కనీసం 20 శాతం ఫోటోలు, లేదా గ్రామానికి రెండు ఫోటోల చొప్పున ఎంపీడీఓ ఆఫీసులోని ఏపీఓ, కాంట్రాక్ట్ స్టాఫ్, పర్మినెంట్ స్టాఫ్ అదే రోజు ధృవీకరించి, నివేదికను కలెక్టర్, డీఆర్‌డీఏకు పంపించాలి.

జిల్లా స్థాయిలో.. ముందు రోజు క్యాప్చర్ చేసిన ఫోటోల్లో కనీసం 30 ఫోటోలను కలెక్టర్ ధృవీకరించాలని ఆదేశాల్లో పేర్కొంది. డీఆర్‌డీఏ కాంట్రాక్ట్, పర్మినెంట్ స్టాఫ్ ఒక్కొక్కరు జిల్లావ్యాప్తంగా వచ్చిన మొత్తం ఫోటోల్లో రోజుకు 10 శాతం లేదా 200 ఫోటోలను ధృవీకరించాలి. అలాగే.. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రోజుకు 20 ఫోటోలను ధృవీకరించాలని సూచించింది. కమిషనరేట్‌లో పనిచేసే కాంట్రాక్ట్, పర్మినెంట్ స్టాఫ్ ఒక్కొక్కరు 100 ఫోటోలు లేదా రాష్ట్రవ్యాప్తంగా ముందు రోజు అప్‌లోడ్ అయిన వాటిలో ఐదు శాతం ఫోటోలను ధృవీకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

యాప్‌లో ప్రస్తుతం తీసిన ఫోటోలు కేవలం 15 రోజులు మాత్రమే నిల్వ అవుతున్నాయి. అయితే.. ఇకపై ఉపాధి హామీ కూలీల ఫోటోలు, మస్టర్ వివరాలను సోషల్ ఆడిట్ పూర్తయ్యే వరకు, అంటే ఒక సంవత్సరం పాటు నిల్వ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఫోటోల నిల్వ కోసం ఒక్కో మండలానికి 1 టీబీ (టెరాబైట్) కెపాసిటీ గల హార్డ్ డిస్క్‌ను కొనుగోలు చేయాలని కూడా ఉత్తర్వుల్లో సూచించారు.

ఈ కొత్త విధానం పారదర్శకతను పెంచుతుందని ఆశిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయి సిబ్బంది తమ ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరం నాలుగైదు గ్రామాల బాధ్యతలు చూస్తున్నామని.. ఉదయం, మధ్యాహ్నం పని ప్రదేశాలకు వెళ్లి ఫోటోలు తీసుకోవడం వ్యయ, ప్రయాసలతో కూడిన పని అని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం వల్ల సిబ్బందిపై పని భారం పెరగడంతో పాటు, రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన పరిష్కార మార్గాలు కనుగొనాలని వారు కోరుతున్నారు. ఇటీవల ఉపాధి కూలీల రోజు వారీ కూలీ పెంచిన విషయం తెలిసిందే.

## కొత్త రేషన్ కార్డులు.. ఇంకాస్త సమయం..

తెలంగాణ: కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేటలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తామని, దీని ద్వారా 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తామని, ఇది దేశంలోనే గొప్ప సంక్షేమ పథకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం.. రాష్ట్ర రాజకీయాల్లో ఒక గేమ్ చేంజర్ అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రింటింగ్ దశలో ఉన్న రేషన్ కార్డులు సిద్ధమయ్యాక భౌతికంగా లబ్ధిదారులకు అందజేస్తామని.. అప్పటి వరకు రేషన్ కార్డు నంబర్‌తో పాటు కుటుంబ వివరాలు లబ్ధిదారుల జాబితాలో చేరుస్తామని తెలిపారు. వీరందరికీ వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం అందుతాయని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే మూడు నెలల రేషన్ పంపిణీ చేసిన ప్రభుత్వం సెప్టెంబర్ నెల నుంచి కొత్తగా రేషన్ పంపిణీ చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదని.. కేవలం ఉప ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే పంపిణీ చేశారని ఆయన గత ప్రభుత్వాన్ని విమర్శించారు.

తమ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. అదనంగా 95 లక్షల కొత్త కార్డులు ఇవ్వబోతున్నామని వివరించారు. దీంతో పాత, కొత్త కార్డులతో కలిపి మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3 కోట్ల 10 లక్షలకు చేరుతుందని తెలిపారు. ఏడాదికి రూ.13 వేల కోట్లు వ్యయం చేస్తూ ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇంత భారీ స్థాయిలో.. నాణ్యమైన సన్నబియ్యంతో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించడం దేశంలోనే తెలంగాణలో ప్రథమం అని, ఇంతకంటే గొప్ప సంక్షేమ పథకం మరెక్కడా ఉండదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేషన్ బియ్యం ప్రజలు తినేవారు కాదని విమర్శించారు.

కొత్త రేషన్ కార్డుల మోడల్ ఖరారైందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి మూడు రంగులతో కూడిన కార్డు, ఎగువన ఉన్న వారికి గ్రీన్ కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇది పారదర్శకతను పెంచడంతో పాటు, లబ్ధిదారుల వర్గీకరణకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇంతటి సార్థకత ఉన్న ఈ కార్యక్రమంపై ప్రతిపక్షాలు రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి వ్యాఖ్యానించారు. పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న తమ ప్రభుత్వం, ఎన్నికల హామీలను నెరవేర్చడంలో వెనుకడుగు వేయదని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అలర్ట్..

సిరిసిల్ల: జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్‌బీగీతే ఆధార్ వివరాల అప్‌డేట్‌పై దృష్టి సారించారు. 5–15 ఏళ్ల మధ్య పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, పాఠశాలల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి 10 వేల జనాభాకు ఒక CSC ఏర్పాటు చేయాలని, ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలను ఈ–బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. ఆధార్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ తమ ఆధార్ కార్డులో వివరాలను, బయోమెట్రిక్‌లను తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా , ఎస్పీ మహేష్‌బీగీతే కోరారు. ఇటీవల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఈ ఆదేశాలు జారీ చేశారు. కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలను ఈ–బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. ప్రతి 10 వేల జనాభాకు ఒక కామన్ సర్వీస్ సెంటర్ (CSC) ఏర్పాటు చేయాలని, త్వరలో మరో 36 కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్లను మార్చాలని సూచించారు. జిల్లాలో 5 నుండి 15 సంవత్సరాలలోపు ఉన్న 27 వేలకు పైగా జనాభాకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కలెక్టర్, ఎస్పీ ఉద్ఘాటించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక అవగాహన క్యాంపులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి మాట్లాడుతూ.. 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డులు అందేలా చూడాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారికి ఆధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రాల్లో ఆధార్ కార్డు వివరాలను అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టల్ కార్యాలయం నుంచి ఎన్ని ఆధార్ కార్డులు తప్పుడు చిరునామాల కారణంగా వెనక్కి వచ్చాయో వివరాలు అందించాలన్నారు. జిల్లాలోని వివిధ అనాథ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ నమోదులో వచ్చే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# వైసీపీ నేత తొందరపాటు..




ఆంధ్రప్రదేశ్: వైసీపీ నేత పోతిన మహేష్ లండన్ పర్యటనలో ఉన్నారు. కుమార్తె మాస్టర్స్ డిగ్రీ పట్టా అందుకుంటున్న నేపథ్యంలో పోతిన మహేష్ లండన్ వెళ్లారు. ఈ నెల ప్రారంభంలో లండన్ వెళ్లిన పోతిన మహేష్.. తాజాగా లార్డ్స్ క్రికెట్ స్టేడియం వద్దకు వెళ్లారు. అక్కడ భారత క్రికెట్ అభిమానులను కలిసి ఫోటోలు దిగారు. అయితే లార్డ్స్ క్రికెట్ స్టేడియం వరకూ వెళ్లిన పోతిన మహేష్ భారత్, ఇంగ్లాండ్ మూడో టెస్టు చూడకుండానే వెనుదిరిగారు. అందుకు కారణం వివరిస్తూ పోతిన మహేష్ ట్వీట్ చేశారు. పోతిన వెంకట మహేష్.. సింపుల్‌గా అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పాలంటే పోతిన మహేష్ .. ఒకప్పుడు జనసేన పార్టీలో ముఖ్య నేత.. పవన్ కళ్యాణ్ వద్ద కీలకంగా పనిచేసిన వ్యక్తి. 2024 ఎన్నికల సమయంలో భేదాభిప్రాయాలు రావటంతో జనసేన నుంచి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే పోతిన మహేష్ అంచనాలు తలకిందులయ్యాయి. వైసీపీ ఘోర పరాజయం పాలవ్వగా.. జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. 21 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లలోనూ విజయఢంకా మోగించి.. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామి పార్టీగా ఉంది.

అయితే అదంతా గతం.. వైసీపీలో చేరిన పోతిన మహేష్ ఆ పార్టీ సిద్ధాంతాలను బలంగా వినిపిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం తీరును, విధానాలను ఎండగడుతున్నారు. ఇక ఇటీవల లండన్ పర్యటనకు వెళ్లారు పోతిన మహేష్. జూలై నెల మొదట్లో కుటుంబంతో కలిసి లండన్ పర్యటనకు వెళ్లారు. కుమార్తె మాస్టర్స్ పట్టా తీసుకుంటున్న క్రమంలో లండన్ వెళ్లిన పోతిన మహేష్ కుటుంబం.. ఆ కార్యక్రమంలో పాల్గొంది. అప్పటి నుంచి లండన్‌లోని ప్రముఖ ప్రదేశాలను సందర్శిస్తూ ఉన్నారు. ఈ క్రమంలో భారత్- ఇంగ్లాండ్ మూడో టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించారు పోతిన మహేష్. అక్కడ భారత అభిమానులను కలిసి వారితో ఫోటోలు దిగారు. ఈ ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు పోతిన మహేష్.

"ఈ రోజు లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించా. లార్డ్స్ వద్ద భారతీయ అభిమానుల సందడి నెలకొంది. అయితే మ్యాచ్ చూసే అవకాశం లేకపోయింది. ఈ రోజు నా తిరుగు ప్రయాణం." అంటూ పోతిన మహేష్ ట్వీట్ చేశారు. లండన్ పర్యటన ముగించుకుని తిరిగి రావాల్సి వస్తోందని.. లార్డ్స్ స్టేడియం వద్దకు వెళ్లి కూడా మ్యాచ్ చూసే అవకాశం లేకుండా పోయిందనే చిన్నపాటి అసంతృప్తితో పోతిన మహేష్ ట్వీట్ చేశారు. అయితే ముందే ప్లాన్ చేసుకుని ఉంటే ఈ ఇబ్బందులు తప్పేవిగా అంటూ నెటిజనం కామెంట్ చేస్తున్నారు. మ్యాచ్ షెడ్యూల్ చూసుకుని.. ఆ షెడ్యూల్ ప్రకారం లండన్ టూర్ షెడ్యూల్ చేసుకుని ఉంటే సరిపోయేదని అభిప్రాయపడుతున్నారు.

# గోవా గవర్నర్‌గా చంద్రబాబు ఫ్రెండ్

ఆంధ్రప్రదేశ్: కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజుకు కీలక పదవి లభించింది. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు నియమితులయ్యారు. మూడు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ఈ క్రమంలోనే పూసపాటి అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. అశోక్ గజపతి రాజు గతంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు.



తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు కీలక పదవి లభించింది. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును కేంద్ర ప్రభుత్వం నియమించింది. కొత్తగా మూడు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు.. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రవీందర్ గుప్తాను నియమి ంచారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన విడుదలైంది. మరోవైపు పూసపాటిఅశోక్ గజపతి రాజు గతంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి గానూ, కేంద్ర మంత్రి గానూ పనిచేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగానూ అశోక్ గజపతి రాజు పనిచేశారు.

పూసపాటి అశోక్ గజపతి రాజు విజయనగరం సంస్థానానికి చెందిన రాజవంశీకులు. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా వ్యవహరించారు. 2014 –18 మధ్యకాలంలో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతి రాజు పనిచేశారు. అశోక్ గజపతి రాజు ఏడుసార్లు ఎమ్మెల్యేగానూ గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు మంత్రిత్వశాఖలు నిర్వహించారు. సింహాచలం ఆలయ దేవస్థానం, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. అయితే 2024 ఎన్నికల సమయంలో అశోక్ గజపతి రాజు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమార్తె పూసపాటి అదితి గజపతి రాజు విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

మరోవైపు గవర్నర్ల నియామకంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి కీలక పదవులు దక్కాయనే చెప్పొచ్చు. ఇప్పటికే విశాఖపట్నానికి చెందిన కంభంపాటి హరిబాబు గవర్నర్‌గా కొనసాగుతున్నారు. కంభంపాటి హరిబాబును ఒడిశా గవర్నర్‌గా గతేడాది డిసెంబర్‌లో నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ గజపతి రాజుకు కూడా గవర్నర్ పదవి దక్కటంతో ఆ ప్రాంతానికి కీలక పదవులు లభించినట్లైంది. మరోవైపు 2014 –19 మధ్య టీడీపీ ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉంది. ఈ సమయంలో కూడా ఓ గవర్నర్ పదవిని టీడీపీకి ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అప్పటి రాజకీయ కారణాలతో అది కుదర లేదు. ఆ తర్వాత ఏపీకి ప్రత్యేక హోదా కావాలంటూ టీడీపీ ఎన్డీఏ కూటమి నుంచి బయటకు రావటం జరి గింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం పాలైం ది. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా బరిలోకి దిగి విజయం సాధించాయి. ఈ క్రమంలోనే అప్పటి హామీని ఇప్పుడు బీజేపీ నెరవేర్చిందనే వార్తలు వస్తున్నాయి.

# శ్రీవారికి ప్రతి రూపాయి లెక్క చెప్పాల్సిందే..

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. 'ప్రతి ఏటా సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతి నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చింది' అని చెబుతుంటారు. అయితే ఈ ఆణివారం ఆస్థానం రోజు ఎన్నో ఏళ్లుగా ఓ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఆణివారం ఆస్థానం నిర్వహించే రోజున.. తిరుమల శ్రీవారి ఆలయానికి సంబంధించిన గతేడాది (పూర్వ సంవత్సరం) లెక్కల్ని స్వామివారికి సమర్పిస్తారు. గతేడాది ఆదాయం, వ్యయాలు, ఆస్తులు, అప్పులు వంటి లెక్కల్ని శ్రీవారికి సమర్పిస్తారు. 'ఇన్ని కోట్లమంది భక్తులు దర్శించుకున్నారు.. వారికి అన్నప్రసాదాలు సహా ఇతర సౌకర్యాలు ఏ కొరత లేకుండా కల్పించాము.. కానుకల రూపంలో ఇంత ఆదాయం వచ్చింది.. ఇంత ఖర్చు అయ్యింది' అంటూ ఆ లెక్కల్ని స్వామివారికి సమర్పిస్తారు.

అంతేకాదు కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ముందు టీటీడీ కొత్త ఖాతా పుస్తకాలను స్వామివారి పాదాల దగ్గర ఉంచుతారు. భవిష్యత్తులో తిరుమల ఆలయ నిర్వహణ సజావుగా సాగాలని స్వామివారు ఆశీస్సులు కోరుతూ ప్రత్యేకంగా పూజలు చేస్తారు. అనంతరం పాత ఖాతా పుస్తకాలను, కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను, అలాగే ఆ లెక్కల పుస్తకాలకు సంబంధించిన తాళాలు టీటీడీ ఈవోకు



అప్పగిస్తారు. అయితే గతంలో మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన సమయంలో ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుంచి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు వంటివాటి వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. కానీ తిరుమలలో టీటీడీ పాలకమండలి ఏర్పడిన తర్వాత ఆ సంప్రదాయంలో మార్పులు చేశారు. వార్షిక బడ్జెట్‌ను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చారు. ఎన్నో ఏళ్లుగా ఈ ఆణివారం ఆస్థానం నిర్వహిస్తారని అందరికి తెలుసు.. కానీ స్వామివారికి లెక్కలు సమర్పించే అంశాలు మాత్రం చాలామందికి తెలియదు.

ఆణివారం ఆస్థానం రోజున ఉదయం 7 గంటలకు తిరుమల శ్రీవారి బంగారువాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. 'సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు' ఇది ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది.

ఆణివారం ఆస్థానం రోజున తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్ స్వామి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. జీయ్యర్ స్వామి ఆరు పెద్ద పట్టువస్త్రాలను పెద్ద వెండితట్టలో తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగించిన తర్వాత నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. ఇక మిగిలిన రెండు పట్టు వస్త్రాల్లో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించడం సంప్రదాయంగా వస్తోంది.

'అనంతరం ఆలయంలో అర్చకులు తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్ స్వామివారికి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయ్యర్ స్వామివారికి, టీటీడీ తరఫున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు. ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు' అని టీటీడీ చెబుతోంది.

# చదువు చెప్పిన గురువుకు శిష్యుడి షాక్..

కోనసీమ: జిల్లాలో ఒక విచిత్రమైన ఘటన వెలుగుచూసింది. ఒకప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఇంటికే కన్నం వేసిన శిష్యుడి ఉదంతమిది. రామచంద్రపురానికి చెందిన వీరబ్రహ్మం అనే వ్యక్తి, తన గురువు శ్రీనివాస్ ఇంటిని దోచుకున్నాడు. శ్రీనివాస్ విశాఖపట్నం వెళ్లిన సమయంలో, ఇంటి తాళం పగలగొట్టి రూ.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించాడు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

చదువు చెప్పిన గురువును జీవితంలో మర్చిపోలేము.. ఒకవేళ మనకు ఎక్కడైనా కనిపిస్తే ఒక్క నమస్కారం చేసి ఆయన్ను గౌరవిస్తాము. కుదిరితే ఓ చిన్న సన్మానం చేసినా తప్పులేదు. ప్రతి వ్యక్తి జీవితంలో గురువు పాత్ర అంత కీలకం.. కానీ ఈ శిష్యుడు మాత్రం దారి తప్పాడు. చదువు చెప్పి ఆదరించి ఉపాధి కల్పించిన గురువు ఇంటికి కన్నం వేశాడు. పోలీసులకు దొరకనని భావించాడు.. కానీ సీసీ ఫుటేజ్‌తో అడ్డంగా బుక్ అయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామచంద్రపురానికి చెందిన దేవగుప్త వీరబ్రహ్మం వడ్రంగి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరబ్రహ్మం చిన్నప్పుడు హెడ్‌మాస్టర్ దొంతంశెట్టి శ్రీనివాస్ దగ్గర చదివారు. ఆ చనువుతో శ్రీనివాస్ రామదుర్గావీధిలో ఉన్న తన ఇంటిని వీరబ్రహ్మంకు అద్దెకు ఇచ్చారు. హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ మాత్రం శోభ హాస్పిటల్ వెనుక వైపు ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరబ్రహ్మం తన దగ్గరే చదవడంతో శ్రీనివాస్ మాస్టారు ఇంట్లో చిన్నచిన్న పనులు చెప్పేవారు.. ఆ పనులు చేసుకుంటూ నమ్మకంగా ఉండేవాడు. వీరబ్రహ్మంకు మాస్టారి ఇంట్లో ఏ వస్తువుల ఎక్కడ ఉన్నాయో పూర్తిగా తెలుసు. ఈ నెల 3వ తేదీన హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి విశాఖపట్నం పనిమీద వెళ్లారు.. తాను ఊరు వెళుతున్న విషయాన్ని వీరబ్రహ్మానికి కూడా చెప్పారు. ఈ నెల 7న శ్రీనివాస్ మాస్టారి ఇంటి మెయిన్ డోర్ పగలగొట్టి ఉంది.. ఈ విషయాన్ని గమనించినపని మనిషి వెంటనే యజమానికి సమాచారం అందించారు. ఆయన వెంటనే విశాఖపట్నం నుంచి బయల్దేరి రామచంద్రాపురం చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. దాదాపు రూ.50 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా వీరబ్రహ్మం దొంగతనం చేసినట్లు గుర్తించారు.. మాస్టారు ఊరికి వెళుతున్నానని చెప్పడంతో.. ఆ వెంటనే వీరబ్రహ్మం మాస్టారి ఇంట్లో చోరీకి ప్లాన్ చేశాడు.. మెయిన్ డోర్ పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. లోపల ఉన్న కప్‌బోర్డు కింద సీక్రెట్ అర ఉంటుందని తెలిసి.. దానిని పగులగొట్టి అందులో ఉన్న బంగారం మొత్తాన్ని చోరీ చేశాడు. సీసీ ఫుటేజ్ ఆధారంగా అతడ్ని ప్రశ్నిస్తే నేరం చేసినట్లు అంగీకరించాడు. వీరబ్రహ్మం నుంచి చోరీ చేసిన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. పక్కా ప్లాన్ ప్రకారం గురువు ఇంటికి కన్నం వేసిన శిష్యుడు అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లాడు.

# ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరగక్కర్లేదు..

ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం విద్యుత్ సమస్యల పరిష్కారానికి సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు ఇకపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, మొబైల్ నుంచే ఫిర్యాదు చేయవచ్చు. డిస్కం వెబ్‌సైట్‌లు, వాట్సాప్ నంబర్లు, యాప్‌ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా 24 గంటలూ సేవలు అందిస్తున్నారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులు టవర్ లొకేషన్ ఆధారంగా వెంటనే స్పందిస్తారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సరికొత్త ఆలోచన చేసింది. కరెంట్‌కు సంబంధించిన సమస్యల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిస్కంలు కొత్త టెక్నాలజీని తీసుకొచ్చారు. గతంలో కరెంట్ పోతే ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. జస్ట్ మొబైల్ నుంచి బటన్ నొక్కితే అధికారులు స్పందించేలా ఏర్పాట్లు చేశారు.. వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే సమస్యను పరిష్కరించేలా చేశారు. ప్రజలు ఎక్కడ ఉన్నా, ఏ డిస్కం పరిధిలో ఉన్నా ఫిర్యాదు చేయొచ్చు. 'ఒకవేళ మీరు వేరే రాష్ట్రంలో ఉన్నా సరే, మీ డిస్కం వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు' అంటున్నారు. ఇకపై ప్రజలకు కరెంట్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం చాలా సులువు.

ఏపీ ప్రజలు డిస్కంల వారీగా ఫిర్యాదులు చేయొచ్చు. ఉభయ గోదావరి, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల వారు ఈపీడీసీఎల్‌కు వెళ్లాలి. గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల వారు సీపీడీసీఎల్ వెబ్‌సైట్‌కు వెళ్లాలి. నెల్లూరు, రాయలసీమ జిల్లాల వారు ఎస్పీడీసీఎల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు అని అధికారులు తెలిపారు. ఒకవేళ ప్రజలు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం ఇబ్బందిగా ఉంటే కనుక వాట్సాప్ నంబర్లకు మెసేజ్ చేయొచ్చు. ఈ 3 డిస్కంలకు ప్రత్యేకంగా యాప్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. వెంటనే ఆ యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేయొచ్చంటున్నారు అధికారులు.

ప్రజల నుంచి వచ్చే కరెంట్ సమస్యల పరిష్కారం కోసం 24 గంటలూ పనిచేసేలా డిస్కంలు ఫిర్యాదు కేంద్రాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఎవరికైనా సమస్య వస్తే.. వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేస్తే వారి టవర్ లొకేషన్ ఆధారంగా.. వారి కాల్ సంబంధిత డిస్కంకు కనెక్ట్ అవుతుంది. ఆ వెంటనే సిబ్బంది ఫిర్యాదును తీసుకుని ఐవీఆర్ఎస్‌లో రికార్డ్ చేస్తారు. అదే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలనుకుంటే కనుక కింది పద్ధతిని ఫాలో అవ్వాలి.

'డిస్కం వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. వినియోగదారుల ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.. ఆ తర్వాత కంప్లైంట్ రిలేటెడ్‌లోకి వెళ్లి 'కంప్లైంట్'పై క్లిక్ చేసి 16 అంకెల సర్వీస్ నంబర్ ఎంటర్ చేసి సబ్మిట్ చేయాలి. మొబైల్ నంబర్, ఈ-మెయిల్, ఫిర్యాదు చేసిన విద్యుత్ కనెక్షన్ ఉన్న ఇంటికి దగ్గరలో ల్యాండ్ మార్క్ వివరాలు ఇవ్వాలి. సమస్య ఏంటి, కంప్లైంట్ సబ్ టైప్స్‌లో అసలు ఎలాంటి సమస్యో ఎంపిక చేసుకుని అడ్రస్ రాయాలి. అప్పుడు మొబైల్‌కు ఫిర్యాదుకు సంబంధించిన ఒక నంబర్ వస్తుంది.. ఈ నంబర్ ఆధారంగా ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు విద్యుత్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు అధికారులు.

# నెలకు రూ.4 వేలు అకౌంట్‌లో...

ఆంధ్రప్రదేశ్: అనాథ పిల్లల కోసం 'మిషన్ వాత్సల్య' పథకం అమలవుతోంది. తల్లిదండ్రులు లేని పిల్లలకు, కష్టాల్లో ఉన్న పిల్లలకు ఇది ఒక గొప్ప సహాయం. కేంద్ర ప్రభుత్వం వారి చదువుకు, పోషణకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.4 వేలు ఇస్తారు. గత ప్రభుత్వం సరిగా పట్టించుకోకపోయినా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకువెళుతోంది. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి చదవండి!

ఆంధ్రప్రదేశ్‌లో మరో పథకం అమలవుతోంది.. అదే అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా సాయం అందుతోంది. తల్లిదండ్రులు లేని పిల్లలకు, ఇతర కారణాల వల్ల అనాథలైన పిల్లలకు ఈ పథకం అండగా ఉంటోంది. కేంద్రం వారి చదువుకు, పోషణకు డబ్బు సహాయం చేస్తోంది. 2023లో కేంద్రం ఈ పథకాన్ని మొదలు పెట్టింది. ఏపీలో ఈ పథకం ద్వారా పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.4 వేలు ఇస్తారు. అంటే ఏడాదికి రూ.48 వేలు వారి బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయిజ. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించి సాయం కూడా అందిస్తోంది.

# రైలు బోగీలకు మంటలు..



తిరుపతి: రైల్వేస్టేషన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. తిరుపతి రైల్వేస్టేషన్ లూప్‌లైన్‌లో నిలిపి ఉంచిన రైలులో ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. రైలు ఆఖరి బోగీలలో మంటలు చెలరేగగా.. సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. మంటలను నియంత్రించారు. అయితే ఈ ఘటనలో ఓ బోగీ పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదవశాత్తూ జరిగిందా, లేక ఆకతాయిల పనా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసు కుంది. తిరుపతి రైల్వేస్టేషన్ లో రైలులో మంటలు చెలరేగాయి. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి గ్యారేజ్‌కు తీసుకెళ్తున్న తిరుపతి హిసార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు చెలరేగాయి. ప్రయాణికులను కిందకు దించేసి లూప్ లైన్‌లో రైలు ఆగి ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఓ బోగీలో చెలరేగిన మంటలు.. ఆ పక్కనే ఉన్న మరో బోగీకి కూడా విస్తరించాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో తిరుపతి రైల్వేస్టేషన్ లోపల ఉన్న ప్రయాణికులు కంగారు పడ్డారు. అయితే వెంటనే అక్కడకు చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను నియంత్రించారు. రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి మంటలను నియంత్రించారు. ఈ ఘటనలో ఒక బోగీ పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా నిప్పు పెట్టారా లేక ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనా అని ఆరా తీస్తున్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి ఎక్కువ. తిరుమల శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో రైల్వేస్టేషన్ కిటకిటలాడుతూ ఉంటుంది. వచ్చీపోయే రైళ్లు, ప్రయాణికులతో రైల్వేస్టేషన్‌లో హడావిడి వాతావరణం ఉంటుంది. అయితే రైలు బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో ప్రయాణికులు, శ్రీవారి భక్తులు భయపడిపోయారు. అయితే లూప్ లైన్‌లో నిలిపి ఉంచిన ఖాళీ రైలు అని తెలియటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై రైల్వే పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా లేక ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నాయా అనే విషయంపై దర్యాప్తు జరుపుతున్నారు. మరోవైపు తిరుపతి జిల్లా గాజుల మండ్యం మండలంలో ప్రమాదం జరిగింది. గాజుల మండ్యం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం జరిగింది. పారిశ్రామికవాడలో ఉన్న క్రోమో మెడికేర్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలింది. ఈ ఘటనలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఎంతో శ్రమించి మంటలను నియంత్రించారు. గాయపడిన కార్మికులకు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కన్నతల్లిని స్తంభానికి కట్టేసిన కొడుకు..

చిత్తూరు: జిల్లా కుప్పంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లిని స్తంభానికి కట్టేసి వీడియో తీశాడో కొడుకు. ఈ వీడియో వైరల్ కాగా పోలీసులు దర్యాప్తు జరిపారు. అయితే పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. సానుభూతి పొందాలనే ఉద్దేశంతోనే తల్లితో కలిసి సురేష్ ఇలా నాటకం ఆడి వీడియో తీసినట్లు పోలీసులు గుర్తించారు.. సురేష్‌ను అరెస్ట్ చేశారు. కుప్పంలో ఇటీవల కూడా ఇలాంటి ఘటనే జరిగిన సంగతి తెలిసిందే.

ప్రస్తుత సమాజంలో పరిస్థితులు ఎలా తయారయ్యాయో తెలియజేసే ఘటన చిత్తూరు జిల్లా కుప్పంలో చోటుచేసుకుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గం కుప్పంలో మరో దారుణం అంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కార్లగట్ట గ్రామంలో ఓ మహిళను ఓ వ్యక్తి స్తంభానికి కట్టేసిన వీడియో వైరల్ అవుతోంది. కుప్పం నియోజకవర్గంలో అరాచకాలు మితిమీరుతున్నాయి.. మహిళలు మీద దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయంటూ ఈ వీడియో వైరల్ చేస్తున్నారు. అయితే ఈ వైరల్ వీడియోపై కుప్పం పోలీసులు స్పందించారు. అసలు సంగతి ఏంటనే దానిపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. దీంతో విస్తుపోవటం పోలీసుల వంతైంది.

పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. శాంతిపురం మండలం కార్లగట్టకు చెందిన మునెయ్యకు ఇద్దరు భార్యలు. మునెమ్మ, గంగమ్మ అనే ఇద్దరు పెళ్లాలు. మునెయ్య ఇటీవలే కాలం చేశారు. పది రోజుల కింద మునెయ్య చనిపోగా.. ఆదివారం కర్మకాండలు కూడా పూర్తి చేశారు. అయితే మునెయ్య చనిపోయిన దగ్గరి నుంచి రెండు కుటుంబాల మధ్య ఆస్తి కోసం తగాదా నడుస్తోంది. ఈ క్రమంలోనే మునెమ్మ కొడుకు సురేష్.. తల్లిని ఇలా పొలాల్లో స్తంభానికి కట్టేసి వీడియో రికార్డ్ చేశాడు. ఆస్తిలో వాటా కావాలంటూ మునెమ్మను స్తంభానికి కట్టేసి.. వీడియో తీశాడు. సానుభూతి పొందాలనే ఉద్దేశంతో తల్లితో కలిసి నాటకం ఆడి.. ఇలా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. ఆ వీడియో వైరల్ అవుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో సురేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

దీంతో సీఎంఈ ఘటనపై స్పందించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే బాధిత మహిళను ఫోన్ ద్వారా పరామర్శించిన చంద్రబాబు.. ఆ కుటుంబానికి రూ.5 లక్షలు సాయం కూడా ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. అయితే ఆ ఘటన తరహాలోనే తమకు కూడా సానుభూతి వస్తుందనే ఉద్దేశంతో సురేష్ ఇలా చేసినట్లు పోలీసులు చెప్తున్నారు.

# సరోజ మృతిపై తెలుగు ప్రముఖుల సంతాపం



తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో లెజెండరీ నటిగా గుర్తింపు పొందిన బి.సరోజా దేవి (87) సోమవారం బెంగళూరులో కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై టాలీవుడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. "భూకైలాస్, పాండురంగ మహత్యం, శకుంతల, దాన వీర శూర కర్ణ" వంటి క్లాసిక్ చిత్రాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్‌తో కలిసి నటించిన ఆమె అన్ని భాషల్లోనూ లేడీ సూపర్‌స్టార్ హోదాను ఆస్వాదించారు. ఆమె మృతికి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించిన అలనాటి నటి బి.సరోజా దేవి సోమవారం కన్నుమూశారు. తెలుగులోనూ ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో ఎన్నో చిత్రాల్లో నటించి ఆమె ఆ కాలంలో సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్ హోదాను అనుభవించారు. భారతీయ సినీ చరిత్రలో అత్యంత విజయవంతమైన హీరోయిన్లతో ఒకరిగా, ఆ కాలంలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకున్న నటిగా ప్రసిద్ధి చెందారు. మాతృభాష అయిన కన్నడ చిత్రం 'మహాకవి కాళిదాసు'తో తెరంగ్రేటం చేసినా తెలుగు, తమిళ భాషల్లోనే ఎక్కువ చిత్రాల్లో నటించడం విశేషం. ఇక తమిళంలో అయితే ఆనాటి హీరోలైన ఎంజీఆర్, శివాజీ గణేషన్, జెమినీ గణేషన్‌లతో వరుస చిత్రాలు చేశారు. ఆ కాలంలో హీరో ఎవరైనా హీరోయిన్ మాత్రం బి.సరోజనే అనేంతగా ఖ్యాతి గడించారు.

'పాండురంగ మహత్యం'తో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఆమె భూకైలాస్, పెళ్లి సందడి, పెళ్లి కానుక, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, ఇంటికి దీపం ఇల్లాలే, మంచి చెడు, శ్రీకృష్ణార్జున యుద్ధం, దాగుడు మూతలు, ఆత్మ బలం, అమరశిల్పి జక్కన్న, ప్రమీలార్జునీయం, శకుంతల, రహస్యం, భాగ్యచక్రం, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, పండంటి కాపురం, శ్రీరామాంజనేయ యుద్ధం, దాన వీర శూర కర్ణ, అల్లుడు దిద్దిన కాపురం.. తదితర చిత్రాల్లో నటించారు. తెలుగులో ఎన్టీఆర్–బి.సరోజ జోడీ హిట్ పెయిర్ ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయింది. పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత కూడా ఎన్నో చిత్రాల్లో నటించిన ఆమె భర్త మరణం తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైపోయారు. 87 ఏళ్ల వయసులో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ సోమవారం బెంగళూరులో కన్నుమూశారు. దీంతో తెలుగు సినీ పరిశ్రమ ఆమెకు ఘనంగా నివాళు లర్పిస్తోంది.

ప్రముఖ నటి శ్రీమతి బి.సరోజాదేవి గారు కన్నుమూశారని తెలిసి బాధపడ్డాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. 1955 నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషా చిత్రాల్లో నటించి చిత్రసీమపై తనదైన ముద్రను వేశారు. భూకైలాస్, పాండురంగ మహత్యం, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శకుంతల, దానవీర శూర కర్ణ, ఆత్మబలం లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. శ్రీమతి బి.సరోజా దేవి గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను

– పవన్ కళ్యాణ్





దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒకనాడు ధ్రువతారగా వెలుగొందిన ప్రముఖ నటీమణి "పద్మభూషణ్" బి. సరోజాదేవి గారు పరమపదిం చారన్న వార్త అత్యంత బాధాకరం. అప్పట్లో తెలుగులో NTR గారితో, తమిళంలో MGR గారితో, కన్నడంలో రాజ్ కుమార్ గారితో ఏకకాలంలో హిట్ పెయిర్‌గా వెలుగొందిన ఘనత ఆమెది. మా తండ్రి NTR గారి కాంబినేషన్లో 20 సంవత్సరాల కాలంలో దాదాపు 20 చిత్రాలలో హీరోయిన్‌గా నటించారు. ఆయనతో శ్రీరాముడి ప్రక్కన సీతాదేవిగా, రావణాసురుడి ప్రక్కన మండోదరిగానూ నటించిన ప్రత్యేకత ఆమె సొంతం. శ్రీమతి బి. సరోజా దేవి మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు, ముఖ్యంగా దక్షిణ భారత చిత్ర పరిశ్రమకు తీవ్ర విచారకరమైన పరిణామం. ఆమె వెండితెరపై మరియు నిజజీవితంలో చేసిన సేవలు రాబోయే తరాల తారలకు, చలనచిత్ర వర్గాల వారికి స్ఫూర్తినిస్తాయి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను

– నందమూరి బాలకృష్ణ

## వినట్లేదెందుకు హరి హరా!!



చరిత్ర గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. ఇప్పటి వరకూ భారతీయ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించే అనేక చారిత్రక చిత్రాలు వచ్చాయి. రాజులు, యుద్ధాలు, వీరులు, పోరాటాలు, గత కాలపు సంఘటనలు, సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించిన సినిమాలకు విశేషమైన ప్రేక్షకాదర దక్కింది. అందులో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన చరిత్ర, తెలంగాణ సాయుధ పోరాటాలకు సంబంధించిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు 'హరి హర వీరమల్లు' వంటి హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ మూవీ ఆడియన్స్ ను అలరించడానికి వస్తోంది.

**ఐదేళ్లుగా నిర్మాణ దశలో...**

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన సినిమా 'హరి హర వీరమల్లు'. ఇది ఆయన కెరీర్ లోనే భారీ బడ్జెట్ మూవీ. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో 2020 జనవరిలో ఈ చిత్రం అధికారికంగా ప్రకటించబడింది. అదే ఏడాది సెప్టెంబర్ లో సెట్స్ మీదకు వెళ్లిన ఈ సినిమా.. కోవిడ్ పాండమిక్, పవన్ క్రియాశీలక రాజకీయాలు ఇతరత్రా కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది. మధ్యలో క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, నిర్మాత ఏఎం రత్నం కొడుకు జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఒక్క కథను రెండు భాగాలుగా రూపొందించాలని నిర్ణయించుకున్నారు. 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో ఫస్ట్ పార్ట్ రిలీజ్ కానుంది.

'హరి హర వీరమల్లు' పార్ట్–1 సినిమా ఇప్పటికే అనేకసార్లు వాయిదా పడింది. బహుశా తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యధికసార్లు వాయిదా పడిన చిత్రం ఇదే అనుకుంటా. ఎన్నో వ్యవప్రయాసలు పడి ఎట్టకేలకు సినిమాని విడుదలకు సిద్ధం చేశారు. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. తెలుగుతో పాటుగా తమిళం మలయాళం కన్నడ హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు అభిమానుల నుంచి మంచి స్పందన లభించింది. ముందు పెద్దగా బజ్ లేదు కానీ.. ట్రైలర్ వచ్చిన తర్వాత హైప్ క్రియేట్ అయింది. అదే సమయంలో కొన్ని వివాదాలు కూడా చుట్టుముట్టాయి.

**చారిత్రక యోధుడిగా పవన్ కళ్యాణ్ ...**

'హరి హర వీరమల్లు' ఫస్ట్ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని విధంగా ఒక చారిత్రక యోధుడి పాత్రలో కనిపించడంతో, ఈ సినిమా స్టోరీపై అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో ఒక పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోం దని వార్తలు వచ్చాయి. కోహినూర్ వజ్రం చుట్టూ కథ నడుస్తుందని, పవన్ ఒక రాబిన్ హుడ్ తరహా పాత్రలో కనిపించనున్నారని చెప్పుకున్నారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ ని చూపించడంతో నిజమైన చరిత్ర ఆధారంగానే చిత్రీకరించారని అనుకున్నారు. అదే సమయంలో తెలంగాణ పోరాట వీరుడు పండుగ సాయన్న జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమాను తీశారనే టాక్ నడిచింది.

నిజాం పాలనలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చుకున్న ప్రజా నాయకుడు పండుగ సాయన్న. ఈయన సుమారు 1860 – 1900 మధ్య కాలంలో జీవించి ఉండవచ్చని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామం ఆయన జన్మస్థలం. ధనవంతులను, భూస్వాములను, నిరంకుశ నిజాం అధికారులను ఎదిరించి పేద ప్రజలకు దానధర్మాలు చేసి 'తెలంగాణ రాబిన్‌హుడ్' గా పేరుగాంచారు. ధనవంతుల ఇళ్లపై, గోదాములపై దాడులు చేసి.. ఆ ఆహార ధాన్యాలను ఆకలితో అలమటించే పేద ప్రజలకు పంచిపెట్టేవారు. ఆయన కథ ఆధారంగానే వీరమల్లు పాత్రని క్రియేట్ చేసారని టాక్ వచ్చింది.

**హరి హర రాయలు కథతో వీరమల్లు..**

'హరి హర వీరమల్లు' అనే టైటిల్ కారణంగా హరి హర రాయలు కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిందనే వార్తలు వచ్చాయి. సంగమ వంశానికి చెందిన హరి హర రాయలు.. క్రీ.శ. 1336లో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. మొదటి హరిహర రాయలు కేవలం ఒక రాజ్య స్థాపకుడిగానే కాకుండా, దక్షిణ భారతదేశంలో హిందూ సంస్కృతి, ధర్మాన్ని రక్షించి, భవిష్యత్ తరాలకు గొప్ప వారసత్వాన్ని అందించిన ఒక విజనరీ పాలకుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన కథని స్ఫూర్తిగా తీసుకునే వీరమల్లును తెరకెక్కిస్తున్నారని వార్తలు వచ్చాయి.

**వీరమల్లు వివాదాలు...**

'హరి హర వీరమల్లు' సినిమా తెలంగాణ బందూక్, తెలంగాణ పోరాట యోధుడు, ప్రజావీరుడు పండుగ సాయన్న జీవిత కథను పోలి ఉందని, చరిత్రను వక్రీకరిస్తున్నారని బీసీ సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమ య్యాయి. ఇది పండుగ సాయన్న సాయన్న స్టోరీ కాదని, విజయ నగరం సామ్రాజ్యం స్థాపించిన హరి హర రాయలు బుక్క రాయల కు సంబంధించిన కథ అని చెప్తున్నారని ఆరోపించారు. 1406–10 మధ్య కాలంలోనే హరి హర రాయలు శకం ముగిసిందని, కానీ ట్రైలర్ లో 1650 – 1707 మధ్య జీవించిన ఔరంగజేబుతో పవన్ కళ్యాణ్ యుద్ధం చేసినట్లు చూపించారని, 1591లో కులీ కుతుబ్ షాహీ కట్టించిన చార్మినార్ కనిపిం చిందని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. చరిత్రను వక్రీకరించి తీస్తున్న ఈ సినిమా విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీనిపై మేకర్స్ వివరణ ఇచ్చారు.

## రవితేజ చంపేస్తా అన్నాడు..

యువ దర్శకుడు సందీప్ రాజ్ తన రాబోయే ప్రాజెక్ట్‌లపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'కలర్ ఫోటో' తర్వాత రవితేజతో సినిమాకు ప్రయత్నించినా, అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాలతో 'మౌగ్లీ' అనే సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవితేజతో సినిమా ఆలస్యం కావడంతో, యూత్‌ఫుల్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సందీప్ తెలిపారు. టాలీవుడ్ లో యువ దర్శకుడిగా, రచయితగా, నటుడిగా మల్టీ టాలెంటెడ్ అనిపించుకున్నారు సందీప్ రాజ్. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించిన ఆయన, 2020లో 'కలర్ ఫోటో' సినిమాతో డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. డెబ్యూ మూవీతోనే నేషనల్ ఫిలిం అవార్డును గెలుచుకొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు తన నిర్మాణంలో '%నూ×=% – ఆల్ ఇండియా ర్యాంకర్స్' అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రమోషన్స్ లో భాగంగా తన అప్ కమింగ్ ప్రాజెక్ట్స్ పై మాట్లాడారు. 'కలర్ ఫోటో' లాంటి నేషనల్ అవార్డ్ ఫిలిం తీసిన తర్వాత కూడా సందీప్ రాజ్ కు దాదాపు ఐదేళ్ల గ్యాప్ వచ్చింది.

ప్రస్తుతం యాంకర్ సుమ కొడుకు రోషన్ కనకాలతో 'మౌగ్లీ' అనే మూవీని డైరెక్ట్ చేస్తున్నారు. రెండో సినిమా తెరకెక్కించడానికి ఇన్నేళ్ల గ్యాప్ తీసుకుపోవడం, అది కూడా ఒక యంగ్ హీరోతో చేయడంపై సందీప్ స్పందించారు. చాలామంది పెద్ద హీరోలకు కథలు చెప్పానని, కానీ అవన్నీ పెద్ద సినిమాలు కావడంతో బడ్జెట్లు సెట్ అవ్వలేదని తెలిపారు. రవితేజతో ఓ సినిమా కోసం దాదాపు మూడేళ్లపాటు ట్రావెల్ చేసానని దర్శకుడు చెప్పారు.

"నేను ఎవరి దగ్గరకు వెళ్లినా వాళ్లని మించిన కథను తీసుకొని వెళు_న్నాను. దాని వల్ల బడ్జెట్ సెట్ అవ్వడం లేదు. ఒక సినిమా కోసం హీరో రవితేజతో ట్రావెల్ చేశాను. అయితే ఈ ఏడాది కూడా ఆయన బిజీగా ఉన్నారు. 'అనవసరంగా నీ గోల్డెన్



టైం అంతా వేస్ట్ చేసుకుంటున్నావ్.. నాకు రెండు కమిట్మెంట్స్ ఉన్నాయి. అర్థం చేసుకో అబ్బాయ్' అని రవితేజ నాతో అన్నారు. అప్పటికే మూడేళ్లు అయింది. నేను ఇంకో కథ రాసుకోవడం స్టార్ట్ చేస్తాను అని చెప్పాను. ఎక్కువ టైం వేస్ట్ చేసుకోకుండా హ్యాపీగా చేసుకొని రమ్మన్నారు" అని సందీప్ రాజ్ తెలిపారు. అయితే తనకు చెప్పిన కథను ఎప్పటికైనా తనతోనే చేయాలని రవితేజ చెప్పారన్నారు. "నాకు చెప్పిన కథ ఇంకెవరితో అయినా తీస్తే చంపేస్తాను.. నాతోనే తీయాలి అని రవితేజ అన్నారు. అది మీకోసమే రాసిన స్టోరీ అని చెప్పాను. నాలుగేళు_గా తన మైండ్ లో ఉన్నదంతా తీసేసి, ఫ్రెష్ గా ఈసారి థియేట్రికల్ డెబ్యూ చేస్తున్నానని అనుకోని ఒక యూత్ ఫుల్ లవ్ స్టోరీ రాయాలని నిర్ణయించుకున్నా. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో మొత్తం న్యూ సెటప్ లో చేద్దాం అని అనుకున్నా. ఈ ప్రాసెస్ లో ఉన్నప్పుడు రోషన్ కనకాల నటించిన 'బబుల్ గమ్' మూవీ రిలీజయింది. ఫస్ట్ సినిమాలోనే అంత కాన్ఫిడెంట్ గా చేసాడు. పర్ఫెక్ట్ గా ఉన్నాడనిపించింది. ఒక గంటలోనే మీటింగ్ అయిపోయింది. ఇద్దరం కలిసి చేద్దాం అనుకున్నాం. వెంటనే ప్రాజెక్ట్ సెట్ అయింది" అని సందీప్ రాజ్ చెప్పారు.

## ఏళ్లుగా కాపురం.. చివరికి విడాకులు



కలకాలం కలిసి ఉంటామని ఒక ఆడ, మగ కలిసి చేసుకునే ప్రమాణమే పెళ్లి. కానీ, గత కొంతకాలంగా పెళ్లి చేసుకుని విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇక సెలబ్రిటీల పెళ్లిళ్లు ఎంత ఆసక్తిని పెంచుతున్నాయో.. వారి విడాకులు అంతకంటే ఎక్కువ చర్చకు దారితీస్తున్నాయి. ఎన్నో ఏళ్లు ప్రేమించుకుని, చివరికి పెళ్లి చేసుకున్నా.. ఎక్కువ రోజులు కలిసి ఉండలేక విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య భారీగా ఉంటోంది. ఇక మరికొన్ని స్టార్ కపుల్స్ అయితే.. ఎన్నో ఏళ్లు కలిసి కాపురం చేసి, చివరికి ఎవరి దారి వారు చూసుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గత కొంతకాలంగా విడాకులు తీసుకున్న సెలబ్రిటీ జంటలు ఏవి? అసలు ఈ స్టార్ కపుల్స్ విడిపోవడానికి కారణాలు ఏంటి? వివరాలు..













గత కొంతకాలంగా దేశంలో సెలబ్రిటీ విడాకుల ఘటనలు బాగా పెరుగుతున్నాయి. నూరేళ్లు కలిసి ఉంటామని పెళ్లిళ్లు చేసుకుంటున్నా.. కొన్ని రోజులు కూడా కలిసి ఉండటం లేదు. ప్రేమించుకుని, పెళ్లి చేసుకుని అంతా హ్యాపీగా ఉంది అనుకునే సమయంలో విడాకుల ప్రకటన చేయడం.. ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. పెళ్లిళ్ల సీజన్లో కొత్త జంటల ఫోటోలు ఎంత వైరల్ అవుతున్నాయో.. ఇప్పుడు విడాకుల వార్తలు కూడా అంతే ఫాస్ట్‌గా వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు ఏడడుగుల బంధం అంటే ఏడు జన్మల బంధం అని భావించేవారు.. కానీ, ఇప్పుడు మాత్రం 7 ఏళ్లు కలిసి ఉంటే అదే గొప్ప అనేంతగా పెళ్లిళ్లు మారిపోతున్నాయి. సినిమా, స్పోర్ట్స్, బిజినెస్.. ఇలా ఏ రంగంలో చూసినా స్టార్ కపుల్స్ తమ పెళ్లి బంధానికి గుడ్‌బై చెప్పి.. విడాకుల అనౌన్స్‌మెంట్ చేసేస్తున్నారు. ఇక సెలబ్రిటీల పెళ్లిళ్లు అంటే.. కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి చేసుకుని.. కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలకే.. 'మాకొద్దు బాబోయ్ ఈ దాంపత్య జీవితం' అంటూ.. విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.


సెలబ్రిటీల విడాకులకు అనేక కారణాలు ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత తరం సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితానికి, స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహ బంధంలో సర్దుకుపోవడం కంటే.. తమ సంతోషానికి ప్రాధాన్యత ఇవ్వడానికి వెనుకాడటం లేదు. సినిమా, క్రీడా, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి కెరీర్ ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. నిరంతరం

















ప్రయాణాలు, షూటింగ్ షెడ్యూల్స్, వ్యాపార లావాదేవీలు వంటివి వ్యక్తిగత సంబంధాలపై ప్రభావం చూపడం వల్ల భార్యాభర్తల మధ్య దూరం ఏర్పడుతోంది.

సెలబ్రిటీల జీవితంపై మీడియా, సోషల్ మీడియా ఎప్పుడూ దృష్టి పెడతాయి. సెలబ్రిటీలకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో పెట్టి విశ్లేషిస్తారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితంలోకి అతిగా చొచ్చుకువెళ్లడం వారి బంధాలపై ఒత్తిడిని పెంచుతుంది. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటం వల్ల, బంధంలో ఇమడలేనప్పుడు విడిపోవడానికి వెనుకాడటం లేదు. విడాకుల పట్ల సమాజంలో గతంలో ఉన్న చిన్నచూపు ఇప్పుడు తగ్గుతోంది. విడాకులు తీసుకోవడం అంటే గతంలో పెద్ద తప్పుగా భావించేవారు. ఇది వ్యక్తిగత నిర్ణయంగా.. పరిస్థితుల ప్రభావంగా ప్రస్తుత సమాజం చూస్తోంది.

టీమిండియా క్రికెటర్ మహమ్మద్ షమీ, హసిన్ జహాన్ విడిపోయారు. 2018లో హసిన్ జహాన్.. షమీపై గృహహింస, వరకట్న వేధింపులు, వివాహేతర సంబంధం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. నాటి నుంచి షమీ, జహాన్ మధ్య విడాకులు, భరణం విషయంలో చట్టపరమైన పోరాటం కొనసాగుతోంది. జహాన్‌కు, వారి కుమార్తెకు నెలకు రూ.4 లక్షల భరణం చెల్లించాలని ఇటీవల కలకత్తా హైకోర్టు ఆదేశించింది. జహాన్‌కు రూ.1.5 లక్షలు, వారి కుమార్తె ఖర్చుల కోసం రూ.2.5 లక్షలు కేటాయించారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,